ప్రజాశక్తి
సోమవారం 12 జూన్ 2023 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

'పర్చూరు'లో

ఇన్‌ఛార్జి వసూళ్లపైనే దృష్టి

- బాలినేని, కరణం భేటీలో ఇదే ప్రధాన ఎజెండాగా చర్చ
- ఇప్పటికే పర్చూరు నేతల నుంచి సిఎం జగన్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

పర్చూరు నియోజకవర్గంలో పాలకపక్ష ఇన్‌ఛార్జి వివిధ రంగాల నుంచి భారీగా వసూళ్లు చేయడంపై వైసిపి ఉమ్మడి ప్రకాశం జిల్లా ముఖ్యనేతలు దృష్టి సారించారు. ఆయా రంగాల నుంచి రోజువారీగానూ.. నెలవారీగానూ రూ.కోట్లలో వసూళ్లు చేస్తున్నారు. వీటిపై ఇప్పటికే పెద్ద ఎత్తున ప్రచారం సాగుతోంది. వీటిని ఆపాలని ఆయా రంగాల నుంచి పాలకపక్ష పెద్దలకు వినతులు వెళుతున్నాయి. పర్చూరు నియోజకవర్గం నుంచి జిల్లా కేంద్రానికి ఎవరు వచ్చినా అక్కడ జరుగుతున్న వసూళ్ల వ్యవహారంపైనే చర్చ నడుపుతున్నారు. వాటిని ఆపకుంటే పార్టీ తీవ్రంగా నష్టపోతుందని చెబుతున్నారు.

ఇదే విషయాన్ని వారం రోజుల క్రితం నియోజకవర్గంలోని వైసిపి నేతలు పలువురు సిఎం జగన్‌కు ఫిర్యాదు కూడా చేశారు. వివిధ కీలక రంగాల నుంచి వసూళ్లు ఆపకుంటే ఎన్నికల్లో పెద్దఎత్తున నష్టం జరుగుతుందని హెచ్చరికలు కూడా పంపారు. ఆయన అక్కడ పోటీలో ఉంటారో, లేదో తెలియదు గానీ అక్రమంగా రూ.కోట్లలో వసూళ్లు చేసుకుంటున్నారని చర్చించుకుంటున్నారు. చీరాలలో గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన ఆమంచి కృష్ణమోహన్ కొద్దికాలం అక్కడే పార్టీలో చక్రం తిప్పారు. అయితే తెలుగుదేశం నుంచి గెలిచిన కరణం బలరాం ప్రభుత్వానికి మద్దతుగా ఉన్నారు. ఆయన కుమారుడికి వైసిపి చీరాల ఇన్‌ఛార్జి పదవి ఇచ్చారు. దీంతో ▶ 7లో

ఫేస్‌బుక్‌లో..

మైనార్టీలను దుర్భాషలాడుతూ పోస్ట్

జాతీయరహదారిపై ముస్లిముల రాస్తారోకో 3లో

బడి గంట మోగింది..!

- 12 నుంచి 17 వరకు ఒంటిపూట బడులు
- నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం
- వేసవి సెలవులను పొడిగించాలి
- ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో బడి గంట మోగనుంది. 45 రోజుల విరామం తరువాత పాఠశాలలు తిరిగి ప్రారంభం కానున్నాయి. జిల్లాలో రోహిణి కార్తె ప్రభావంతో ఎండలు హడలెత్తిస్తున్నాయి. 40 నుంచి 45 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదవుతునానయి. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 12 నుంచి 17 వరకు ఒంటి పూట బడులు నిర్వహించాలని నిర్ణయించింది. ఎండల ప్రభావంతో విద్యార్థులు ఇబ్బందులు పడే అవకాశ ఉండటంతో వేసవి సెలవులను పొడిగించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

జిల్లాలో సోమవారం నుంచి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు తిరిగి ప్రారంభ కానున్నాయి. వేసవి సెలవులు ముగియటంతో పాఠశాలలు మళ్ళీ కళకళలాడనున్నాయి. ప్రభుత్వం అకడమిక్ క్యాలెండర్ ప్రకారం ఈనెల 12 నుంచి పాఠశాలలు ప్రారంభం కావాలి. జిల్లాలో ప్రభుత్వ, ఎయిడెడ్, జడ్పీ, మున్సిపల్ ఉన్నత పాఠశాలలు, ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి.ఆయా పాఠశాలల యాజమాన్యాలు తిరిగి పాఠశాలలను ప్రారంభించేందుకు సిద్ధమయ్యారు. ప్రైవేట్ పాఠశాలలలో విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, ఇతర సామాగ్రి సమకూర్చుకున్నారు. ఇక తల్లిదండ్రులు పాఠ్య పుస్తకాలు, హడనోటు పుస్తకాలు, యూనిఫారం, ఇతర సామాగ్రిని సమకూర్చే పనిలో పడ్డారు. దీంతో పాటు విద్యార్థులు సైతం వారికి అవసమైన వస్తువులను సర్దుకొనే పనిలో పడ్డారు.

హడలెత్తిస్తున్న ఎండలు

రోహిణికార్తె ప్రభావంతో జిల్లాలో ఎండలు హడలెత్తిస్తున్నాయి. పగటి ▶ 2లో

ఒంగోలు నిరసన తెలుపుతున్న వామపక్షాల నేతలు

బిజెపి సంబరాలు చేసుకోవటం సిగ్గుచేటు

అమిత్‌షా పర్యటనను వ్యతిరేకిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన 5లో

పంట కాలువలకు

మరమ్మతులెప్పుడో..?

- రైతుల గోడు ప్రభుత్వానికి పట్టేనా..!
- రూపురేఖలు కోల్పోయిన కొమ్మమూరు కాలువ

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఖరీఫ్ వ్యవసాయ సీజన్ ప్రారంభమైంది. రైతులు ఏరువాక పట్టారు. దుక్కులు దున్ని వరి సాగు కోసం విత్తనాలకు సిద్ధం చేసుకుంటున్నారు. అయితే మాగాణి సాగుకు అతి ముఖ్యమైన పంట కాలువల మరమ్మత్తుల గురించి ఏ మాత్రం ముందుచూపు లేని రాష్ట్రప్రభుత్వం రైతులను ఏడాదికి మూడు పంటలు పండించుకోండి అంటూ ఈ నెల 7న కృష్ణా పశ్చిమ డెల్టాకు 500 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ఈ నీటితో పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో తాగునీటి అవసరాల కోసం రక్షిత మంచినీటి చెరువులను నింపడం సాధ్యపడుతుంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో వర్షాలు పడక ముందే అన్ని పంటకాలువల, మురుగు కాలువల మరమ్మత్తు పనులు పూర్తిచేస్తేనే పంట పొలాలకు సక్రమంగా సాగునీరందడం సాధ్యపడుతుంది. పశ్చిమ డెల్టాలో ఉన్న అన్ని పంట కాలువలు కూడా పూడిక తీయక, గుర్రపు డెక్క విపరీతంగా చేరినందున సాగు నీరు దిగువకు రావడం కష్టంగా మారింది. బాపట్ల జిల్లాలోని దిగువ పంటపొలాలకు కొమ్మమూరు కాలువ ద్వారా సక్రమంగా సాగునీరు చేరాలంటే నీటిమట్టాన్ని

కొమ్మమూరు కాలువ

సరిపడా ఉంచాలి. కానీ కట్టలు పటిష్టంగా లేనందున పూర్తిస్థాయిలో నీటి విడుదల సాధ్య పడటం లేదు. రాష్టంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏ సీజన్‌లోను పంట కాలువల మరమ్మత్తుల కోసం తగిన నిధులు విడుదల చేసింది లేదు. కాంట్రాక్టర్లు పనులు చేసినా బిల్లులు మంజూరు కాక ఎవరు ముందుకు రాని దుస్థితి ఉంది. రూ.5 లక్షల లోపు పనులను స్థానిక రైతుసంఘాలకు నామినేషన్‌పై ఇచ్చినా వారికి కూడా బిల్లులు రాక ఇబ్బందులు పడ్డారు. దీంతో గత సంవత్సరం భారీ వర్షాల కారణంగా వరదలు వచ్చి గుర్రపుడెక్క వల్ల దిగువకు నీటిపారుదల లేక రైతులు పంటను నష్టపోయారు. ఈ సీజన్‌లో కూడా కాలువకు నీరు వదులుతున్నారు గానీ మరమ్మతులు ▶ 2లో

నివాళులర్పిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రమాదేవి

సిపిఎం నాయకుడు లాజర్‌కు ఘన నివాళి

4లో

నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి

ఆక్సిజన్ అందక ఆస్తమా రోగి మృతి 3లో

'పర్చూరు'లో ఇన్‌ఛార్జి వసూళ్లపైనే దృష్టి

(మొదటిపేజీ తరువాయి)

అక్కడ ఇన్ ఛార్జిగా ఉన్న ఆమంచి కృష్ణమోహన్‌ను తప్పించారు. ఆయన ఉనికి కోసం పోరాటం చేశారు. ఎట్టకేలకు సిఎం జగన్ చీరాల నుంచి పర్చూరు ఇన్‌ఛార్జిగా నియమించారు. దీంతో ఆమంచి కృష్ణమోహన్ అనివార్యంగా పర్చూరు ఇన్‌ఛార్జిగా వెళ్లారు. వెంటనే అక్కడ భారీగా వసూళ్లు కార్యక్రమం చేపట్టారని పార్టీ నేతలు గగ్గోలు పెడుతున్నారు. దీనిపై అక్కడ పార్టీలోనూ పోరు సాగుతోంది. సిఎం జగన్‌కే నేరుగా ఫిర్యాదు చేశారు. ఏఏ రంగాల నుంచి ఎంత మొత్తంలో వసూలు చేస్తున్నారనేది స్పష్టంగా ఇచ్చారు. ఈ నియోజకవర్గం నుంచీ పలువురు వైసిపి నేతలు కూడా జిల్లా నేతలకు ఫిర్యాదులూ చేశారు. కోఆర్డినేటర్ల దృష్టికి తీసుకుపోయారు. అయినా ఆగలేదు. సీని యర్ నేత బాలినేని శ్రీనివాసరెడ్డికి, చీరాల ఎమ్మెల్యే కరణం బలరాం దృష్టికీ అవకాశం ఉన్నప్పుడల్లా పర్చూరు నేతలు ఇదే విషయాన్ని పిర్యాదు చేస్తున్నారు. అయితే ఈ వ్యవహారం సిఎంఓకు చేరింది. అక్కడ చర్చకు వచ్చింది. అయితే వసూళ్ల పర్వం మాత్రం ఆగలేదంటున్నారు. రెండ్రోజుల క్రితం ఒంగోలులో సీనియర్ నేత కరణం బలరాం ఇంటికి చీరాలకు చెందిన పలువురు వైసిపి కౌన్సిలర్లు, నేతలు వచ్చారు. ఇదే సమయంలో సీనియర్ నేత బాలినేని కూడా వచ్చారు. ఈ భేటీలో ప్రధానంగా పర్చూరు నియోజకవర్గంలో వసూళ్ల వ్యవహారమే చర్చ సాగినట్లు తెలుస్తోంది. వీటిని ఏదో రకంగా ఆపకుంటే పార్టీతో పాటు ఆయా రంగాలకు చెందిన యజమానులు, వ్యాపారుల నుంచి కూడా పార్టీకి భవిష్యత్‌లో సహకారం అందదని చర్చ సాగింది. సీనియర్ నేతలు ఇద్దరూ దీనిపై లోతుగానే చర్చించారని సమాచారం. ఇప్పటికే సిఎం జగన్ దృష్టికి కూడా తీసుకుపోయారని సమాచారం. ఎందుకంటే చాలాకాలంగానే ఈ వసూళ్లు నడుస్తున్నాయని బహిరంగంగానే చర్చ సాగుతోంది. వసూళ్లలో కిడ్నాప్‌లు కూడా సాగుతున్నాయి. బెదిరింపులు నడుస్తున్నాయి. ఇంకా చెప్పాలంటే రౌడీ రాజ్యం అక్కడ నడుస్తోందని వైసిపి నేతల మధ్య చర్చ సాగినట్లు తెలుస్తోంది. వైసిపి నేతలు ఇటీవల సిఎం జగన్‌కు ఫిర్యాదు చేశారు. అందులో పేర్కొన్న మొత్తాలను పరిశీలిస్తే గ్రానైట్ రంగం నుంచీ నెలకు రూ.1.51 కోట్లు, గ్రావెల్ నుంచీ రూ.22.50 లక్షలు, ఇసుక లారీల నుంచి రూ.కోటి, కోల్డ్‌స్టోరేజీల నుంచి రూ.9.60 లక్షలు, రేషన్ బియ్యం విభాగం నుంచి రూ.50 లక్షలు, ఇలా నెలకు రూ.3.33 కోట్లు వసూళ్లు జరుగుతున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై సిఎం జగన్ ఎలా స్పందించారనేదీ స్పష్టత లేదు. పార్టీలోని ఇతర పెద్దలు దృష్టికీ వెళ్లింది. అయితే ప్రస్తుతం ఈ వ్యవహారం ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ముఖ్యనేతల మధ్య తీవ్ర చర్చకు ఎజండాగా మారింది. సీనియర్ నేతలు కరణం బలరాం, బాలినేనితో పాటు ఇతర నేతలు కూడా ఈ వ్యవహారాన్ని సీరియస్‌గానే తీసుకుంటున్నారు. ఇక తెలుగుదేశం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కూడా ఈ అక్రమ వసూళ్లపై ఈపాటికే ప్రకటన కూడా చేశారు. సొంతపార్టీ నేతలే ఫిర్యాదులు చేసినందున సిఎం జగన్ దీనిపైఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి.


వెంకయ్య నాయుడుకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

వెంకయ్య నాయుడుకు వినతి

పొదిలి : పొదిలి పొగాకు బోర్డు వేలం కేంద్రం-22లో అదనపు పొగాకు కొనుగోలు కోటాకు అమ్మకంపై పెనాల్టీ ఎత్తి వేయాలని కోరుతూ వేలం కేంద్రం ఫ్లోర్ మెంబర్ ఎస్. చంద్ర శేఖర్ ఆధ్వర్యంలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడును ఆదివారం కలిసి వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో పొగాకు రైతు సంఘం నాయకులు వీరనారాయణ, వీరాంజనేయులు, వీరబ్రహ్మం తదితరులు ఉన్నారు.

మంత్రి అంబటి ప్రత్యేక పూజలు

పూజలు నిర్వహిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

ప్రజాశక్తి బాపట్ల

సొంత ఊరికి ఉపకారిగా చరిత్రలో నిలిచిపోయేలా అధునాతన ఆలయాలు నిర్మించి గ్రామంలో శాంతి సామరస్యానికి అంకిత భావాన్ని చాటుకున్న ధన్యజీవి శాసనమండలి చీఫ్ విప్ డాక్టర్ ఉమారెడ్డి వెంకటేశ్వర్లు అని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు కొనియాడారు. ఉమ్మారెడ్డి స్వగ్రామం బాపట్ల మండలం కొండుబొట్ల పాలెంలో అధునాతనంగా నిర్మించిన నూతన దేవాలయ సముదాయాన్ని ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తొమ్మిది పదుల వయసును సైతం లెక్కచేయకుండా అనుకున్న ఆశయాన్ని సాధించటం కోసం ఆత్మవిశ్వాసంతో తన ఆకాంక్షను నెరవేర్చుకున్న డాక్టర్ ఉమ్మారెడ్డి ఆదర్శనీయులని కొనియాడారు. ఈ సందర్భంగా మంత్రి రాంబాబును ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు సత్కరించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు మిర్చి యార్డ్ చైర్మన్ నిమ్మకాయల రాజ నారాయణ, వివేకా సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు అంబటి మురళి, సీనియర్ న్యాయవాది కళ్ళం హరినాథరెడ్డి, బాపట్ల అంజుమన్ కమిటీ అధ్యక్షుడు షేక్ జిలాని, ఆలయ కమిటీ సభ్యులు తదతరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు భక్తిగీతాల పోటీలు

పోటీలో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి-మార్కాపురం

స్థానిక నెహ్రూ బజారులోని శ్రీసాయి బాబా మందిరంలో భక్తి గీతాల పోటీలు ఆదివారం నిర్వ హించారు. ఈ సందర్భంగా చిన్నారులు భక్తి గీతాలను ఆలపించారు. అనంతరం విజేతలకు బహుమతులకు ఆలయ నిర్వాహణ కమిటీ అందచేసింది. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన కార్యదర్శి గోపాలుని హరిహరరావు, గోపాలుని కష్ణమోహన్, ఆలయ కమిటీ సభ్యుల ఎపాల్గొన్నారు.

బడి గంట మోగింది.!

(మొదటిపేజీ తరువాయి)

ఉష్ణోగ్రతలు రోజు రోజుకి పెరుగుతున్నాయి. జిల్లాలో 42 నుంచి 46 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 10 గంటలు దాటితే బయటకు రావటానికి జనం జంకుతున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం నుంచి పాఠశాలలు ప్రారంభం కావటంతో విద్యార్థులు ఇబ్బందులు పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఉదయం 11.30 గంటల వరకు పాఠశాలలను ఒంటిపూట బడులుగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినా ఆ సమయంలో విద్యార్థులు ఇంటికి వెళ్ళే క్రమంలో ఇబ్బందులు పడటం ఖాయంగా కనిపిస్తోంది.

నేటి నుంచి ఒంటిపూట బడులు

ఎండల తీవ్రత నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తం గా ఈనెల 12 నుంచి 17 వరకు ఒంటి పూట బడులు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయిం చింది. ఇందుకు సంబంధించి సర్క్యులర్ జారీ చేసింది. ఆయా తేదీలలో ఉదయం 7.30 నుంచి 11.30 గంటల వరకు బడులను నిర్వహించనున్నారు. ఉదయం 7.30 నుంచి 8.30 గంటల వరకు ఉపాధ్యాయులు విద్యా ర్థులకు పాఠ్యాంశాలు బోధిస్తారు. 8.30 నుంచి 9 గంటల వరకు విద్యార్థులకు తిరిగి పాఠాలు చెబుతారు. మధ్యాహ్నం 11.30 నుంచి 12 గంటల వరకు మధ్యాహ్న భోజనం అందించనున్నారు. ఈనెల 19 నుంచి పాఠశాలలు యధావిధిగా నిర్దేశిత సమయాలలో కొనసాగనున్నాయి.

వేసవి సెలవులు పొడిగించాలి

ఎస్‌ఎఫ్‌ఐ ప్రకాశం జిల్లా కమిటీ

వేసవి సెలవులను పొడిగించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.విజయ్, సిహెచ్ వినోద్ మాట్లాడుతూ ఈనెల 12 నుండి పాఠశాలలు ప్రారంభించి, ఒక పూట మాత్రమే తరగతులు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేసిందన్నారు. ఎండల తీవ్రత అధికంగా ఉందని, ,మధ్యాహ్నం సమయంలో స్కూల్ నుండి ఇంటికి వెళ్లడం కూడా విద్యార్థులకు ఇబ్బందిగా ఉంటుందనానరు. ,హాస్టల్లో వుండే విద్యార్థులు సౌకర్యాల రీత్యా ఇబ్బందులు పడుతారని, .ప్రైవేట్ స్కూల్స్‌లో చదివే విద్యార్థులు బస్సుల్లో ప్రయాణం చేసి ఇంటికి వెళ్ళాలన్నారు. ఇటువంటి సందర్భాల్లో పాఠశాలలు ప్రారంభిస్తే విద్యార్థులు ఆరోగ్యాలపై తీవ్రమైన ప్రభావం పడుతుందన్నారు. విద్యార్థుల ఆరోగ్యం వారి సంక్షేమాన్ని దష్టిలో ఉంచుకొని వాతావరణ పరిస్థితిని బట్టి సెలవులు పొడిగించాలని వారు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

220 మందికి వైద్యపరీక్షలు

వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న వరికూటి

ప్రజాశక్తి-కొండపి

కొండపి జూనియర్ కళాశాలలో వరికూటి చారిటబుల్ ట్రస్ట్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త ఆద్వర్యంలో గుంటూరు పెదకాకాని శంకర్ కంటి ఆసుపత్రి సహకారంతో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ వైద్యశిబిరాన్ని వైసిపి కొండపి నియోజక వర్గ ఇన్‌చార్జి వరకూటి అశోక్‌బాబు , వైసిపి సీనియర్ నాయకుడు డాక్టర్ వరికూటి అమృతపాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా 220 మంది కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో 120 మందికి కంటి ఆపరేషన్ అవసరమని నిర్ధారించారు. వారికి గుంటూరు శంకర్ కంటి ఆసుపత్రిలో సోమవారం కంటి ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు వరికూటి అశోక్‌బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు జి.మురళి, బచ్చల కోటేశ్వరరావు, మారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఆళ్ల శ్రీనివాసరెడ్డి, వెన్నూరు శ్రీను, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంట కాలువలకు మరమ్మతులెప్పుడో.?

(మొదటిపేజీ తరువాయి)

జరిగింది లేదు. వారం రోజుల క్రితం జిల్లా కలెక్టరేట్‌లో జల వనరులు, పంటకాలువల మరమ్మత్తుల విషయమై సమావేశం జరిగింది. పంట కాల్వలలో గుర్రపుడెక్క, తూటికాడ పూర్తిగా తొలగించాలని చీరాల, బాపట్ల శాసనసభ్యులు కరణం బలరామకష్ణమూర్తి, కోన రఘుపతి కోరారు. పంటకాలువల్లో పూడిక తీయకపోవడంతో గత ఏడాది చీరాల ప్రాంతంలో 3 వేల ఎకరాల వరి నారుమళ్లు దెబ్బతిన్నాయన్నారు. దిగుబడి వచ్చే సమయానికి వేల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. అధికారులు ముందస్తు ప్రణాళికలు లేకపోవడంతోనే ప్రతిఏటా రైతులు పలు విధాలుగా నష్టపోతున్నారని చెప్పారు. కాల్వల పూడికతీత పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని ఆయన తెలిపారు. జులై నెలలో వర్షాలు కురిసే అవకాశం ఉందని, వరదలు వస్తే లోతట్టు భూములన్ని మునిగి పంటలకు తీవ్ర నష్టం సంభవిస్తుందన్నారు. వాటిని ముందుగానే అరికట్టాలని అధికారులు ముందస్తు ప్రణాళికతో పనిచేయాలన్నారు.

ఈ వ్యవసాయ ఖరీఫ్ సీజన్ వార్షిక ప్రణాళిక మేరకు 67 టి.ఎం.సిల నీరు విడుదలకు ప్రభుత్వం ఆమోదించింది. జిల్లాలో 3.79 లక్షల ఎకరాల ఆయకట్టు భూములకు కాల్వల ద్వారా సాగునీరు అందాల్సి ఉంది. కాల్వల ఎగువ ప్రాంతంలోని భూములతోపాటు దిగువ ప్రాంతంలోని ఆయకట్టు చివర భూములన్నింటికీ సాగునీరు అందేలా చర్యలు తీసుకోవలసి ఉంది. కొమ్మమూరు కాలువతో పాటు ప్రధానమైన 5 కాల్వల ద్వారా ఆయకట్టు భూములకు నీరు చేరాలి. జిల్లాలోని పంటకాలువలకు 66 ప్రాంతాల్లో మరమ్మతులు చేయడానికి రూ.6.8 కోట్ల నిధులు మంజూరయ్యాయి. మురుగునీటి కాల్వల మరమ్మతుల కోసం రూ.2.75 కోట్లతో 29 పనులను చేపడుతున్నారు. నామినేషన్ పద్ధతిలో కొన్ని, టెండర్ విధానంలో మరికొన్ని పనులు చేపట్టనున్నారు. ఎక్కడ కూడా నేటికి పనులు ప్రారంభం కాలేదు. వర్షాలు కురవకముందే దిగువ ప్రాంతాలకు సాగర్ జలాలు వెళ్లేలోగా యుద్ధప్రాతిపదికన ఆ పనులు పూర్తి చేస్తేనే రైతులకు మేలు జరుగుతుంది.

పేపర్ ప్రకటన

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఐ.ఎ.58/2021 ఇన్ ఓఎస్.52/2021

కోలా ప్రసాద్‌బాబు ...పిటిషనరు

వర్సెస్

కోలా జకరయ్య మరియు నలుగురు ...రెస్పాండెంట్లు

రెస్పాండెంట్ల చిరునామాలు:

3వ రెస్పాండెంట్:
మల్లెపోగు సుబ్బమ్మ, భర్త: ఆదామ్,
తండ్రి కోలా జకరయ్య, వయసు సుమారు 45
సంవత్సరాలు, హిందూ మాదిగ, వ్యవసాయం,
R/o. తాటిచెర్ల పోస్టు మరియు గ్రామము,
కొమరోలు మండలం, ప్రకాశం జిల్లా.

5వ రెస్పాండెంట్
మేకల నరసింహులు, తండ్రి నరసింహులు,
వయసు సుమారు 50 సంవత్సరాలు,
హిందూ, కట్టుబడి, R/o.తాటిచెర్ల పోస్టు మరియు
గ్రామము, కొమరోలు మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు పిటిషన్‌లో వాది పిటిషన్ పరిహారం రాగోరి మీ పై గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో పిటిషన్ దాఖలు చేసినందున, సదరు పిటిషన్‌లో మీరు పై కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలుపుటకు వాయిదా 19వ తేదీ జూన్ నెల 2023సం॥లో ఉన్నది. మీరు ఈ వాయిదా రోజు ఉదయం 10:30 గంటలకు మీరు స్వయంగా గానీ లేదా మీ వకీలు గారి ద్వారా గానీ పై కోర్టులో హాజరై మీ ఆక్షేపణలుంటే తెలుపుకునేది. లేనిచో మీ పరోక్ష మునందు పిటిషను విమర్శించి తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)

గిద్దలూరు :
తేదీ:11.06.2023

శ్రీ షేక్ యాసిన్ బాషా
పిటిషనర్లు తరుపు అడ్వకేట్,
గిద్దలూరు, ప్రకాశం జిల్లా.
సెల్: 9346513649

పేపర్ ప్రకటన

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఓ.ఎస్.నెం.52/2021

కోలా ప్రసాద్ బాబు ...వాది

వర్సెస్

కోలా జకరయ్య మరియు నలుగురు ...ప్రతివాదులు

ప్రతివాది చిరునామా

3వ ప్రతివాది
మల్లెపోగు సుబ్బమ్మ భర్త ఆదామ్,
తండ్రి కోలా జకరయ్య, వయసు సుమారు 45
సంవత్సరాలు, హిందూ మాదిగ, వ్యవసాయం,
R/o. తాటిచెర్ల పోస్టు మరియు గ్రామము.
కొమరోలు మండలం, ప్రకాశం జిల్లా.

5వ ప్రతివాది
మేకల నరసింహులు, తండ్రి నరసింహులు,
వయసు సుమారు 50 సంవత్సరాలు,
హిందూ, కట్టుబడి, R/o.తాటిచెర్ల పోస్టు మరియు
గ్రామము, కొమరోలు మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు దావాలో వాది దావా ప్లైంటు పరిహారం రాగోరి మీపై గిద్దలూరు ప్రిన్సిపాల్ జూనీయర్ సివిల్ జడ్జి వారి కోర్టులో దావా దాఖలు చేసినందున సదరు దావాలో మీరు పై కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలుపుటకు వాయిదా 19వ తేదీ జూన్ నెల 2023 సం॥లో ఉన్నది. మీరు వాయిదా రోజు ఉదయం 10:30 గంటలకు మీరు స్వయంగా గానీ లేదా మీ వకీలు గారి ద్వారా గానీ పై కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలుంటే తెలుపుకునేది. లేనిచో మీ పరోక్షము నందు దావా విమర్శించి తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

గిద్దలూరు.
తేదీ:11.06.2023

ఇట్లు,
శ్రీ షేక్ యాసిన్ బాషా
వాది తరపు అడ్వకేట్,
గిద్దలూరు, ప్రకాశం జిల్లా.
సెల్: 9346513649

నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి.!

- ప్రభుత్వ జిల్లా వైద్యశాలలో దారుణం

- ఆక్సిజన్ అందక ఆస్తమా రోగి మృతి

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం ప్రభుత్వ జిల్లా వైద్యశాలలో దారుణం చోటు చేసుకుంది. సిబ్బంది నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి కావాల్సి వచ్చింది. వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్న ఆస్తమా రోగికి ఆక్సిజన్ సరఫరాలో అంతరాయాన్ని గుర్తించని ఫలితంగా ఈ దారుణం చోటు చేసుకుంది. విద్యుత్ సరఫరా నిలిచిపోవడం... సకాలంలో జనరేటర్‌ను వినియోగించకపవడంతో ఆక్సిజన్ ప్లాంట్ నుంచి ఆస్తమా రోగికి ఆక్సిజన్ సరఫరా నిలిచిపోయింది. దీంతో వైద్యం కోసం వచ్చిన ఆస్తమా రోగి మృతి చెందింది. ఈ ఘటన ఆదివారం ఉదయం చోటు చేసుకుంది.

జిల్లాలోని కురిచేడుకు చెందిన దేవనబోయిన కేశమ్మ (45) ఆస్తమా వ్యాధితో బాధపడుతోంది. కుమారుడు

మృతురాలు కేశమ్మ

తర్లుపాడులోని ఎస్సీ హాస్టల్ నందు వంట పనిలో కొనసాగుతున్నాడు. తన తల్లికి మెరుగైన వైద్యం అందించేందుకు అందుబాటులో ఉన్న మార్కాపురంలోని ప్రభుత్వ జిల్లా వైద్యశాలలో గత పది రోజుల క్రితమే చేర్పించాడు. అక్కడి వైద్యులు వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారు. కేశమ్మ ఆస్తమా రోగి కావడంతో నిరంతరం ఆక్సిజన్ అవసరం. ఆక్సిజన్ అందకపోతే ప్రాణమే పోతుంది. ఆదివారం ఉదయం 7:15 గంటల సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. 9 గంటల వరకు విద్యుత్ లేదు. ఆ సమయంలో వైద్యశాల ఆవరణలో జనరేటర్‌ను వినియోగించాలి. అక్కడ డ్యూటీ డాక్టర్, ఇతర సిబ్బంది విద్యుత్ సరఫరా లేని సమయంలో జనరేటర్‌ను వినియోగించాలన్న ఆలోచన రాలేదు. సుమారు రెండు గంటల పాటు ఆస్తమాతో బాధపడుతున్న కేశమ్మ ఊపిరి ఆడక గిలగిలా కొట్టుకుంది. వైద్య సిబ్బంది ఆమె బాధను అర్థం చేసుకోలేదు. విద్యుత్ వచ్చే సమయానికి కేశమ్మ మృతి చెందింది. ఆక్సిజన్ అవసరమని కేశమ్మ కుటుంబీకులు మొత్తుకున్నా అక్కడ సిబ్బంది పట్టించుకోక పోవడం దారుణం. కేశమ్మ మృతితో కుటుంబీకులు కొద్ది సేపు ఆందోళన చేశారు. ఇంత నిర్లక్ష్యమైతే ఎలా అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడి వైద్యులు, సిబ్బంది బాధితులకు నచ్చజెప్పుకుని అక్కడ నుంచి పంపించినట్లు తెలిసింది. మార్కాపురం ప్రభుత్వ జిల్లా వైద్యశాలలో ఇలాంటి నిర్లక్ష్యం మరోసారి జరగకుండా చూడాలని ఉన్నతాధికారులను ఇక్కడి ప్రజలు వేడుకుంటున్నారు.

మంటలను అదుపు చేస్తున్న స్థానికులు

పూరిళ్లు దగ్ధం

ప్రజాశక్తి-భట్టిప్రోలు

మండల పరిధిలోని ఐలవరం దళితవాడ ప్రమాదవశాత్తు చోటు చేసుకున్న అగ్నిప్రమాదంలో రెండు పూరిళ్లు దగ్ధమయ్యాయి. తొలుత గ్రామానికి చెందిన పంథగాని సుబ్బులుకు చెందిన పూరింటికి నిప్పంటుకుంది. ఎండ తీవ్రంగా ఉండటంతో క్షణాల్లోనే ప్రక్కనున్న పప్పల నాగరాజు కు చెందిన పూరింటికి నిప్పంటుకుంది. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు పవర్ స్ప్రేయర్లతో మంటలను అర్పేందుకు ప్రయ త్నించారు. అయినప్పటికీ రెండు పూరిళ్లు పూర్తిగా కాలిపోయాయి. బాధిత కుటుంబాలు సర్వం కోల్పోయారు.

ఫేస్‌బుక్‌లో..

మైనార్టీలను దుర్భాషలాడుతూ పోస్ట్

జాతీయ రహదారిపై ముస్లిముల రాస్తాకోరో

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

చిన్న చౌదరి చియాన్ అనే పేరుతో ముస్లింలను, క్రిస్టియన్‌లను కించ పరుస్తూ వారి మహిళలను సైతం అసభ్య పదజాలంతో దూషిస్తూ ఫేస్‌బుక్‌లో ఆదివారం రాత్రి పోస్టు పెట్టాడు. అది తెలుసుకున్న వందలాది మంది ముస్లిం యువకులు బైకు ర్యాలీ నిర్వహించారు. కించ పరుస్తూ పోస్టు పెట్టిన వ్యక్తిని అరెస్టు చేయాలంటూ డిమాండ్ చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఎదుట సుమారు రెండు గంటలు పాటు ధర్నా నిర్వహించారు. అతనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొంతమంది పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేస్తుండగానే, మరికొంత మంది అంబేద్కర్ బొమ్మ సెంటర్‌లోని 565 జాతీయ రహదారిపై మానవహారం చేపట్టారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రహదారికి ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. సిఐ కె మారుతీకృష్ణ ఆధ్వర్యంలో ఎస్ఐ జి.కోటయ్య ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా చర్యలు చేపట్టారు.

పోలీస్ స్టేషన్ ముందు ధర్నా చేస్తున్న ముస్లింలు

ముస్లింలకు సర్ది చెబుతున్న ఎస్ఐ కోటయ్య

ముస్లింలను, క్రిస్టియన్‌లను అసభ్య పదజాలంతో దూషించాడని యర్రగొండపాలెం పట్టణంలో తెలియడంతో పట్టణంలోని ప్రజలంతా ఉలిక్కి పడ్డారు. ఎప్పుడు ఏమి జరుగుతుందోనని భయభ్రాంతులకు గురయ్యారు. టైర్లు కాల్చి మంటలు వేశారు. పట్టణమంతా నినాదాలతో మారు మ్రోగింది. నిదింతుడి చేత బహిరంగ క్షమాపణ చెప్పించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ జి కోటయ్య ముస్లిం యువకులను సర్ది చెప్పారు. నేషనల్ హైవే జాతీయ రహదారి అయినందున ఎక్కువ సేపు రహదారిలో ఆందోళనలు చేస్తూ వాహనాలకు ఇబ్బంది కలిగించడం భావ్యం కాదన్నారు. చట్టం తన పని తాను చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్ద మౌలానా మహమ్మద్ హిదయతుల్లా, పాటు ముస్లిం, క్రిస్టియన్ సోదరులు పాల్గొన్నారు.

ఇసిజి తీస్తున్న డాక్టర్ గాయత్రి

ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి -గిద్దలూరు రూరల్

గిద్దలూరు పట్టణంలోని విశ్వభారతి హైస్కూల్‌లో గిద్దలూరుకు చెందిన డాక్టర్ బ్రహ్మానంద రెడ్డి హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో జనరల్, గుండె సంబంధిత జబ్బులు, ఎముకలు, కీళ్ల వ్యాధులు ,స్త్రీల వ్యాదులు, కంటి జబ్బులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం వైద్యశిబిరానికి వచ్చిన రోగులకు ఉచితంగా భోజన సౌకర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గాయత్రి ,డాక్టర్ పవన్ కుమార్, డాక్టర్ రామాంజనేయులు , డాక్టర్ నారాయణరెడ్డి, డాక్టర్ సౌమ్య, డాక్టర్ బ్రహ్మానందరెడ్డి , బ్రాహ్మానంద రెడ్డి హాస్పిటల్ సిబ్బంది. ఒంగోలు కిమ్స్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబు నాయుడుతో రాజశేఖర్

రాజశేఖర్‌కు ప్రశంసా పత్రం

కొండపి : మంగళగిరిలోని టిడిపి జాతీయ కార్యాలయంలో నిర్వహించిన సోషల్ మీడియా అభినందన సభలో టిడిపి జాతీయ అధ్యక్షుడు నారాచంద్రబాబు చేతుల మీదుగా కొండపి నియోజకవర్గ ఐటిడిసి అధ్యక్షుడు తిప్పారెడ్డి రాజశేఖర్ ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. తాను ప్రశంసా పత్రం అందుకోవటానికి సహకరించిన ఎమ్మెల్యే స్వామికి, టిడిపి రాష్ట్ర నిర్వహణ కార్యదర్శి దామచర్ల సత్య, టిడిపి నాయకుడు రాజశేఖర్‌కు ఈ సందర్భంగా రాజశేఖర్ కృతజ్ఞతలు తెలిపారు.

వారాహి యాత్రను విజయంతం చేయాలి

జనసేన నాయకుల ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి -మద్దిపాడు

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఈనెల 14న అన్నవరం నుంచి భీమవరం వరకూ నిర్వహిస్తున్న వారాహి యాత్ర విజయవంతం కావాలని కోరుతూ జనసేన పార్టీ మండల అధ్యక్షుడు నున్న బాలసుబ్రమణ్యం ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయం వద్ద నుంచి మల్లవరం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం వరకూ పార్టీ నాయకులు ఆదివారం పాదయాత్ర నిర్వహించారు. తొలుత మద్దిపాడులోని నటరాజ కళాకేంద్ర ఆవరణంలోని బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి జనసైనికులు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీగా బయలు దేరి వెల్లంపల్లి గ్రామం చేరుకున్నారు. అక్కడ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కొలచనకోట ఎస్‌సి కాలనీలో మదర్ థెరిసా, జగజ్జీవన్ రావ్ పూలమాల వేసి నివాళులర్పించారు. మల్లవరంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మల్లవరం శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శించుకుని తమ అధినేత నిర్వహించే వారాయాత్ర విజయవంతం కావాలని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు ఈదర హరిబాబు, ఒంగోలు నగర 38వ వార్డు కార్పొరేటర్ మలగా రమేష్, జనసేన మండల అధ్యక్షుడు నున్న బాలసుబ్రహ్మణ్యం, మండల ఉపాధ్యక్షులు తిరుమల శెట్టి చిరంజీవి, నాయకులు గుండా బత్తుల సోమశేఖర్ సింగరాజు మధు, ఆరె వెంకటేశ్వర్లు సింగరాజు వెంకటేశ్వర్లు, పొన్నం అయ్యప్ప, గాజులు అనిల్ కుమార్, మేడికొండ వశిష్ట పాల్గొన్నారు.

పాదయాత్రలో జనసైనికులు

మజ్జిగ, నిమ్మరసం పంపిణీ చేస్తున్న దశ్యం

మజ్జిగ, నిమ్మరసం పంపిణీ

ప్రజాశక్తి - పంగులూరు

మండల పరిధిలోని ముప్పవరంలో జాతీయ రహదారి ప్రక్కన నిర్వహిస్తున్న ఉమేష్ చంద్ర చలివేంద్రం ఆదివారం మంచినీళ్లు, మజ్జిగ, నిమ్మరసం పంపిణీ చేశారు. స్వాతంత్ర్య సమరయోధుడు గౌతు లచ్చన్న గౌడ్ యువసేన, టిడిపి గౌడ సంఘం ఆధ్వర్యంలో మజ్జిగ, నిమ్మరసం పంపిణీ చేశారు. గత రెండు నెలలుగా ఆటో యూనియన్ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో దాతలు, గ్రామస్తుల సహకారంతో చలివేంద్రాన్ని నిర్వహిస్తున్నారు.

సిపిఎం నాయకుడు లాజర్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి-భట్టిప్రోలు

మండల పరిధిలోని అక్కివారిపాలెం గ్రామంలో సిపిఎం నాయకులు కామ్రేడ్ గొర్రుముచు లాజర్ అంత్యక్రియలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన నాయకులు లాజర్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. పార్టీలో నిబద్ధత కలిగిన వ్యక్తిగానే కుండానే కుటుంబాన్ని పార్టీకి అంకితం చేసిన వ్యక్తి లాజర్ అని పలువురు కొనియాడారు. లాజర్ మతదేహానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.రమాదేవి,రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మెరుగు నాగార్జున, బాపట్ల జిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ దేవినేని మల్లిఖార్జున రావు,రేపల్లె మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్య సిపిఎం, టిడిపి, వైసిపి, సిపిఐ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. లాజర్ మతదేహాన్ని గ్రామస్తులు, పార్టీ నాయకులు ఎర్రజెండాలు చేతబూని నినాదాలతో ర్యాలీగా అంత్యక్రియలకు తరలించారు.

నివాళులర్పిస్తున్న మంత్రి నాగార్జున

లాజర్ అంత్యక్రియల్లో పాల్గొన్న ప్రజలు

లాజర్ ఆశయాలను సాధిద్దాం

నిబద్ధత కలిగిన సిపిఎం నాయకులు కామ్రేడ్ లాజర్ ఆశయాలను సాధిద్దామని సిపిఎం రాష్ట్ర నాయకులు డి. రమాదేవి అన్నారు. సిపిఎం బలోపేతానికి లాజర్ ఎంతో కృషి చేసినట్లు తెలిపారు. లాజర్ కుటుంబానికి పార్టీ పూర్తి అండగా ఉంటుందన్నారు. లాజర్‌కు నివాళులర్పించిన వారిలో సిపిఎం జిల్లా నాయకులు టి.కష్ణమోహన్, వి.వెంకట్రామయ్య, టి.సురేష్, బి.అగస్టీన్, దీపాల సత్య నారాయణ, మురుగుడు సత్యనారాయణ, పి.నాగమల్లేశ్వర రావు, శ్రీనివాసరావు, సుబ్బారావు బట్టు నాగ మల్లేశ్వరరావు,భగవాన్‌దాస్, మనోజ్, అహారోను ,సిపిఐ నాయకులు జి.బాలాజీ, ఎంపిపి డివి. లాలితకుమారి, సర్పంచి నీలా ఉషారాణి రమేష్, టిడిపి నాయకులు సిరాజుద్దీన్, బట్టు మల్లికార్జునరావు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

ప్రజాశక్తి- రేపల్లె

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కృష్ణకిషోర్

క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ఉద్యోగ అవకాశాల్లో మంచి స్థానం ఉంటుందని రేపల్లె అరే మండల సచివాలయ కన్వీనర్ కాకితల కృకిషోర్ తెలిపారు. మండల పరిధిలోని పిరాటలంక గ్రామంలో రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణారావు సహకారంతో గ్రామ వైసిపి అధ్యక్షుడు తోట రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణ కిశోర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రీడా స్పూర్తితో ఆటలు ఆడాలన్నారు. గెలుపోటములు సహజమని, ఈ విషయాన్ని ప్రతి క్రీడాకారుడు గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వైసిపి గ్రామ కన్వీనర్ తోట రాంబాబు మాట్లాడుతూ రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణారావు సహకారంతో గ్రామంలో అనేక అభివద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఆదేవిధంగా కుల, మత, పార్టీలకతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు వేసవి సమయంలో క్రీడాకారులను ప్రోత్సహించాలని దఢ సంకల్పంతో రాష్ట్రస్థాయిలో క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వడ్డీ వారిపాలెం గ్రామ సర్పంచి వడ్డీ సునీత శ్రీనివాసరావు, మోర్తోట గ్రామ సర్పంచి కారాని కృష్ణ కుమారి శ్రీనివాసరావు, పిరాటలంక వైసిపి నాయకులు గొట్టిపాటి దేవర్ధన రావు, చాట్రాగడ్డ మోహన్‌రావు, గొట్టిపాటి శివాజీ, కనపర్తి వీరాస్వామి, నీలా రవికుమార్, గ్రామ పెద్దలు, నాయకులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

సజ్జ వెంకటేశ్వర్లుకు కేకు తినిపిస్తున్న నారా లోకేష్

యువగళం పాదయాత్రలో

'సజ్జా' జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-చీరాల

టిడిపి చీరాల నియోజక వర్గ నాయకుడు సజ్జా వెంకటేశ్వర్లు జన్మదిన వేడుకలను టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువ గళం పాద యాత్రలో నిర్వహించారు. ఈ సందర్భంగా నారా లోకేష్ కట్ చేసి సజ్జా వెంకటేశ్వర్లుకు తినిపించారు. అనంతరం జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సజ్జా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తమ పుట్టినరోజు వేడుకలు నారా లోకేషన్ సంక్షంలో నిర్వహించు కోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అనంతరం యువగళం పాదయాత్రలో పాల్గొన్న 150 మంది కార్యకర్తలకు సజ్జా వెంకటేశ్వర్లు తన సొంత నిధులతో ఒక్కొక్కరికీ రూ. 9,600 విలువైన నైక్ షూను అందజేశారు. పార్టీకి, కార్యకర్తలకు, ప్రజలకు అవసరమైన సందర్భాల్లో అవసరమైన తోడ్పాటును అందించిన సజ్జా వెంకటేశ్వర్లును నారా లోకేష్ అభినందించారు. ఇలాంటి సేవలు నిరంతరం కొన సాగించాలని కోరారు. పార్టీ కార్యకర్తలకు అండగా ఉండటంలో ఇతరులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. రాబోవు ఎన్నికల్లో పార్టీ విజయానికి కషి చేయాలని కోరారు. గత మూడు రోజులుగా లోకేష్ పాదయాత్రలో సజ్జ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

శిథిలావస్థలో పాఠశాల..

- పెచ్చులూడిన స్లాబ్
- వర్షానికి ఉరుస్తున్న తరగతి గదులు
- పట్టించుకోని అధికారులు
- ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు

పెచ్చులూడిన స్లాబ్

నెర్రలిచ్చిన గోడలు

ప్రజాశక్తి- సంతమాగులూరు

మండల పరిధిలోని వెల్లలచెరువు హిందూ ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థలకు చేరింది. స్లాబ్ పెచ్చులూడి ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. ఈ పాఠశాల 1942లో ప్రారంభించారు. ఎనిమిది గదులున్న ఈ పాఠశాల ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. వర్షం వస్తే గదులన్నీ జలమయమే, ఎప్పుడు కూలుతుందోనని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పాఠశాల గోడలు కూడా బీటలు వారాయి. దీంతో ఎప్పుడు కూలుతుందోనని ఉపాధ్యాయులు విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. గత్యంతరం లేక శిథిలమైన గదులలోనే తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులను పాఠశాలకు పంపేందుకు తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం పాఠశాలల అభివద్ధి కోసం ప్రవేశ పెట్టిన నాడు-నేడు పథకంలో ఈ పాఠశాలను చేర్చేందుకు అధికారులు దష్టి సారించలేదు. ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే, ఎవరు బాధ్యత వహిస్తారని విద్యార్థుల ప్రశ్నిస్తున్నారు. వేసవి సెలవుల అనంతరం సోమవారం నుంచి ప్రాఠశాలలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో తమ పిల్లలను పాఠశాల పంపాలా వద్దా అని విద్యార్థుల తల్లిదండ్రులు మదన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాలకు మరమ్మతులు చేయించాలని వారు తెలిపారు.

నూతన వధూవును ఆశీర్వదిస్తున్న బాచిన కృష్ణ చైతన్య

వివాహ వేడుకల్లో కృష్ణచైతన్య

ప్రజాశక్తి -అద్దంకి

మండల పరిధిలోని వెంకటాపురంలో మాగులూరి వారి వివాహ వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈ వేడుకల్లో వైసిపి అద్దంకి నియోజక వర్గ ఇన్‌ఛార్జి బాచిన కృష్ణచైతన్య, వైవి భద్రారెడ్డి పాల్గొని నూతన వధూవరులు అనూషా, నాగఫణింద్ర రెడ్డిని ఆశీర్వదించారు. నూతన దంపతులను ఆశీర్వదించిన వారిలో ఈద శ్రీనివాస్ రెడ్డి, అద్దంకి మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్, వైసిపి నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా అద్దంకి పట్టణంలోని శాంతి అపార్ట్‌మెంట్‌లో తానిపర్తి వారి వివాహ వేడుకలకు హాజరై వరుడు వెంకట రామిరెడ్డిని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మండల పరిధిలోని బొమ్మనంపాడులో గ్రామ వైసిపి నాయకులు కామేపల్లి ఆంజనేయులు మాతమూర్తి కామేపల్లి గోవిందమ్మ దశదిన కర్మలో బాచిన కృష్ణ చైతన్య పాల్గొని గోవిందమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సర్పంచులు, ఎంపిసిటి, వైసిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న వేగేసిన, నిజాం

రూ,50 వేల నగదు అందజేత

ప్రజాశక్తి-పిట్టలవాని పాలెం

మండల పరిధిలోని ఛాందోలు గ్రామానికి చెందిన ఇద్దరు యువతలకు వివాహం సందర్భంగా గ్రామ యువ తెలుగుదేశం నాయకుడు నిజాం అండగా నిలిచారు. తన వంతు సాయంగా రూ.50 వేల నగదును అందజేశారు. టిడిపి బాపట్ల ఇన్‌ఛార్జి వేగేసిన నరేంద్ర చేతుల మీదుగా ఆదివారం ఈ నగదును అందజేశారు.ఈ కార్యక్రమంలో మీరా, సైదా, అన్వర్,ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

కందను గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

కందకు డిమాండ్

- సాగుకు రైతుల ఆసక్తి

ప్రజాశక్తి -కొల్లూరు

మండల పరిధిలోని లంక గ్రామాలకు చెందిన రైతులు ఖరీఫ్ సీజన్‌లో కంద సాగుకు మొగ్గుచూపుతున్నారు. ప్రస్తుతం కందకు మంచి డిమాండ్ ఉంది. గతేడాడి కంద పుట్టి రూ.3 వేల నుంచి రూ.3,500 పలికింది. ప్రస్తుతం రూ.6 వేలు పలుకుతోంది. దీంతో రైతులు ఎక్కువగా కంద సాగుకు మొగ్గ చూపుతున్నారు. కంద సాగుకు ఎకరానికి లక్ష రూపాయల ఖర్చు అవుతుంది. దిగుబడి బాగా వస్తే ఎకరానికి 70 పుట్లు దిగుబడి వస్తుంది. రూ.4 లక్షల మేర ఆదాయం సమకూరుతుంది. ఖర్చుల అన్ని పోను రైతులకు మంచి ఆదాయం వస్తుంది. కంద చెన్నై, బాంబే మార్కెట్లలో మంచి దిమాండ్ ఉంది. దీంతో రైతులు కంద సాగు చేసేందు ఆసక్తి చూపుతున్నారు. ఈ ఏడాది ఎక్కువ విస్త్రీర్ణంలో కంద సాగు చేసే అవకశాం ఉంది.

ప్రజాశక్తి 5
సోమవారం 12 జూన్ 2023

బిజెపి సంబరాలు చేసుకోవటం సిగ్గుచేటు

- విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఉపసంహరించుకోవాలి
- బిజెపి మతోన్మాద చర్యలను ప్రతిఘటించాలి
- వామపక్ష పార్టీల నాయకుల ధ్వజం
- ఒంగోలులో వామపక్షాల నిరసన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

గత 9 ఏళ్ళ కాలంలో దేశాన్ని నాశనం చేసిన బిజెపి సంబరాలు చేసుకోవటం సిగ్గుచేటని, రాష్ట్రానికి ఏమి చేశారో బిజెపి నాయకులు చెప్పాలని వామపక్షాల నాయకులు ధ్వజమెత్తారు. విశాఖపట్నంలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా పర్యటనను వ్యతిరేకిస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఒంగోలు బస్టాండ్ వద్ద ఉన్న సాగర్ లాడ్జి సెంటర్‌లో ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు ఆర్.మోహన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ మాట్లాడుతూ బిజెపి 9 సంవత్సరాల పాలనలో దేశంలో అభివృద్ధిలో వెనుకబడిందన్నారు. కరోనా సమయంలో దేశ ప్రజలను ఆదుకోవాల్సిన కేంద్ర ప్రభుత్వం అందుకు విరుద్ధంగా మూఢ విశ్వాసాలను ప్రజలపై రుద్దిందన్నారు. లక్షలాది మంది కార్మికులు ఉపాధి లేక రోడ్డున పడ్డారని, దేశంలో ప్రజల కొనుగోలు శక్తి దారుణంగా పడిపోయిందన్నారు. ఆదాని, అంబానీల ఆస్తులు వందల రెట్లు గణనీయంగా పెరిగాయని, దేశ ప్రజల అభివృద్ధి కన్నా వారి ఆస్తుల పెంచడమే లక్ష్యంగా 9 ఏళ్ళ కాలంలో మోడీ పాలన సాగిందన్నారు. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలన్నీ నిర్వీర్యం చేశారని, ప్రైవేట్ రంగ అభివృద్ధికి తమ వంతు సహకారాన్ని అందించారన్నారు. మోడీ ఎన్నికల హామీల సందర్భంగా విదేశాలలోని నల్లధనాన్ని తీసుకువచ్చి దేశ ప్రజలకు పంచుతానని రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని ,అవినీతిని పూర్తిస్థాయిలో పెకిలించి వేస్తానని, సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క హామీని నెరవేర్చక పోగా దేశ ప్రజల నెత్తిన మరిన్ని భారాలు మోపారన్నారు. దేశ చరిత్రను వక్రీకరించి ఆర్ఎస్ఎస్ వాదాన్ని, మనువాదాన్ని అమలు చేసే విధంగా విద్యారంగాన్ని వినియోగించుకునేందుకు ప్రయత్నించారన్నారు. గో సంరక్షణ పేరుతో అన్యమతస్తుల పై దాడులు, హత్యలు చేయటం పరిపాటిగా మారిందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఇస్తానన్న ప్రత్యేక హోదా ఇవ్వలేదన్నారు. నవ్యాంధ్ర రాష్ట్రానికి అండదండగా ఉండకుండా, విభజన చట్టంలోని హామీలను నెరవేర్చకుండా, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధులు కేటాయించకుండా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చోద్యం చూస్తుందన్నారు. రాష్ట్ర రాజధాని నిర్మాణానికి నిధులు కేటాయింపులను పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు కేటాయింపులను, కడప స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయడంలో, విశాఖ రైల్వే జోన్ ఏర్పాటు చేయడంలో ,వివక్ష చూపారన్నారు. 32 మంది బలిదానంతో సాధించుకొని లాభాల బాటలో నడుస్తున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటు పరం చేసేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తుందన్నారు. వెనుకబడిన జిల్లా జాబితాలో ప్రకాశం జిల్లాను చేర్చాలని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ రాష్ట్రానికి ,దేశానికి ఇంత అన్యాయం చేసిన బిజెపి పార్టీ నాయకులు రాష్ట్రంలో 9 ఏళ్ల పాలన పేరుతో సంబరాలు జరుపుకోవడం, పర్యటనలు చేయటం సిగ్గుపడాల్సిన విషయమన్నారు. రాష్ట్ర పర్యటనలో బిజెపి అగ్ర నాయకులు జెపి నడ్డా జగన్ ప్రభుత్వం పూర్తిగా అవినీతిమయమైందని, రాష్ట్రం పూర్తిగా అభివృద్ధిలో కుంటుబడిందని చేసిన వ్యాఖ్యలకు ముఖ్యమంత్రి జగన్ స్పందించాలని డిమాండ్ చేశారు జగన్ ఇప్పటికైనా బిజెపి కబంధహస్తాల నుండి బయటకు రావాలని హితవు పలికారు రాష్ట్రానికి తీరని అన్యాయం చేస్తున్న బిజెపి పార్టీ పట్ల ప్రజలు ఆలోచించాలని కోరారు. సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు చిట్టిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వంతో రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదన్నారు. 32 మంది యువకుల బలిదానాలతో సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించేందుకు బిజెపి సిద్ధంగా ఉందన్నారు. కర్ణాటక ఎన్నికలలో ఓటమి నుంచి బయటపడేందుకు రాష్ట్రాలలో విజయోత్సవ సభలు జరుపుకోవటం సిగ్గుచేటన్నారు. మణిపూర్‌లో గిరిజనుల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి బిజెపి ప్రభుత్వం చోద్యం చూస్తుందన్నారు. సిపిఐ ఎంఎల్ జిల్లా నాయకులు పరిటాల కోటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా పర్యటనకు వ్యతిరేకంగా వామపక్షాల ఆధ్వర్యంలో జరిగిన నిరసనలో పాల్గొని విజయవంతం చేసిన వారికి ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు జాలా అంజయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చీకటి శ్రీనివాసరావు, జిల్లా నాయకులు జి.రమేష్, శ్రీరామ శ్రీనివాసరావు, పి.కల్పన, తంబి శ్రీనివాసులు, షేక్ మున్ని, పి.రాజేశ్వరి, పాపని సుబ్బారావు, సిపిఐ నాయకులు ఆర్ వెంకట్రావు,పి వి ఆర్ చౌదరి, ఉప్పుటూరి ప్రకాష్ రావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్ బాబు, రాష్ట్ర సహాయ కార్యదర్శి మహంకాళి సుబ్బారావు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆర్ కరుణానిధి, గులాం హుస్సేన్, ఆర్.రామకృష్ణ, విజయ, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు కొండూరి నాంచార్లు, వామపక్ష పార్టీల కార్యకర్తలు పాల్గొన్నారు

నిరీక్షణ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

డాక్టర్ మండువశ్రీకి నీరాజనం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

డాక్టర్ మండువ నరసింహారావు స్మారక కవి సమ్మేళనం ఈ నెల ఆదివారం సాయంత్రం ఆరు గంటలకు కమలా నర్సింగ్ హోమ్ ఆవరణలో జరిగింది. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి.. ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమానికి నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షులు డా.నాగభైరవ ఆదినారాయణ అధ్యక్షత వహించి.. మాట్లాడారు. నరసింహారావు ఒక వైపు వైద్యం చేస్తూనే సాహిత్య కర్షగా, సాహితీవేత్తగా పలువురు ప్రశంసలకు పాత్రులయ్యారని, అందుకే వారు ధన్యచరితులయ్యారన్నారు. సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రజానాట్యమండలి రాష్ట్ర గౌరవాధ్యక్షులు అన్న నల్లూరి వెంకటేశ్వర్లు ప్రసంగిస్తూ 'చేను దున్నిందంటే -చాలులో రతనాలు, కాడి మోసిందంటే- కనకాభిషేకాలు, పసిడి పంటలు పండగా మన గిత్త పర్వాల నందించురా' అంటూ ఒంగోలు వృషభంపై తన అభిమానాన్ని ప్రదర్శించిన నరసింహారావు మనసున్న డాక్టర్ అని, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కార్యదర్శిగా పనిచేస్తూ దీనుల సేవలో తరించారని, తన తోటివారికి హితవు చెప్పేవారని తెలిపారు. కళామిత్ర మండలి(తెలుగు లోగిలి)సంస్థ జాతీయ అధ్యక్షులు డా.నూనె అంకమ్మరావు ఆయన రాసిన చిరుకవితను ప్రస్తావిస్తూ "పుడితే ఉయ్యాల, పోతే మోయ్యాల, మధ్యలో ఏదో ఒకటి చెయ్యాల' అంటూ ప్రతిమనిషి జీనన మరణాల మధ్య ఏదో ఒకటి సాధించాలని ప్రబోధించిన ఆయన సంకల్పం గొప్పదని పేర్కొన్నారు. కార్యక్రమంలో నవ్యాంధ్ర రాష్ట్ర రచయితల సంఘం గౌరవాధ్యక్షులురాలు తేళ్ల అరుణ, కుర్రా ప్రసాద్‌బాబు, సింహాద్రి జ్యోతిర్మయి, యు.వి.రత్నం, బీరేడి కృష్ణయ్య, కొల్లూరు శ్రీనివాసరావు, డాక్టర్ మున్నంగి రాజకుమారి, కె.కపావరం, కేయస్వీ ప్రసాద్, యం.సూర్యకుమారి, ధర్నాశి చిరంజీవి, యస్.రాధికా రత్న, ఆళ్ళ వెంకటేశ్వర్లు, రామచంద్రుని లక్ష్మీ, రాధామనోరంజని తదితరులు పదిహేను మంది కవులు తమ కవితలతో మండువశ్రీకి ఘనంగా కవితా నీరాజనం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మండువ నరసింహారావు రచించిన 'నిరీక్షణ' పుస్తకాన్ని నల్లూరి ఆవిష్కరించారు.

హక్కుల ఉద్యమకారుడు బాలగోపాల్

పలు ప్రజా సంఘాల నివాళి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

సమాజంలోని ప్రజలందరి హక్కులు, ప్రజాస్వామిక స్ఫూర్తి విస్తరించడం కోసం జీవితాంతం కృషి చేసిన హక్కుల ఉద్యమకారుడు బాలగోపాల్ అని ఓపిడిఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావల సుధాకర్ రావు పేర్కొన్నారు. మానవ హక్కుల నేత కె.బాలగోపాల్ జయంతి కార్యక్రమం ఒంగోలు కలెక్టరేట్ ఎదురుగా ఉన్న మంచి పుస్తక కేంద్రం ఆవరణలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో చావలి సుధాకర్‌రావు మాట్లాడుతూ జలపాతాలు, అణుశక్తి- విధ్వంసం, కల్లోల కథా చిత్రాలు, రాజ్యం- సంక్షేమం, దళిత, రిజర్వేషన్లు- ప్రజాస్వామిక దృక్పథం, ఆదివాసులు- చట్టాలు- అభివృద్ధి వంటి పుస్తకాలు రాసిన మేధావి బాలగోపాల్ అని తెలిపారు. దళిత కవి కత్తి కళ్యాణ్ మాట్లాడుతూ వరంగల్ కాకతీయ విశ్వవిద్యాలయంలో గణిత శాస్త్ర అధ్యాపకులుగా, ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం నాయకుడిగా బాలగోపాల్ నిర్వహించిన పాత్ర ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో కుల నిర్మూలన పోరాట సమితి నాయకులు మేడికొండ జార్జి, విద్యావేత్త, జర్నలిస్టు డాక్టర్ నూకతోటి రవికుమార్, మహిళా సంఘం ప్రతినిధి నల్లూరి క్రాంతి, ఎంఆర్‌పిఎస్ జిల్లా నాయకులు తొరటి ఆనంద మాదిగ, విప్లవ జన సంఘం రాష్ట్ర కన్వీనర్ భీమవరపు సుబ్బారావు, కథా రచయిత మంచికంటి వెంకటేశ్వర రెడ్డి బహుజన రచయిత వేదిక కన్వీనర్ మిరియం అంజిబాబు, విశ్వమానవ సంక్షేమ సంఘం నాయకులు జనార్ధన్, ప్రజాస్వామ్యవాది సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

'చెరువులో నీరు తొలగించటం సరికాదు..'

ప్రజాశక్తి-పంగులూరు

గ్రామానికి అందరికీ త్రాగునీరు అందించే చెరువులోని నీటిని, చేపల కోసం బయటకు పంపించటం అన్యాయమని, దీనివలన గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉందని, మండలంలోని తూర్పు కొప్పెరపాడు గ్రామ పెద్ద గొల్లపూడి ఆంజనేయులు ఆదివారం సాయంత్రం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన వీర గంధం వారి చెరువు నుంచి గ్రామ ప్రజలు దశాబ్దాల తరబడి తాగునీరు ఉపయోగించుకుంటున్నారని ,చెరువులో వేసిన బోరు నుండి ఏడాది పాటు మంచినీళ్లు అందుతున్నాయని అన్నారు. వేసవి వలన చెరువులో ఉన్న కొద్దిపాటి నీటిని కూడా, చేపల వేట కోసమని నీటిని బయటికి పంపడం వలన బోరుకు తగినన్ని నీరు రావని, అందువలన గ్రామ ప్రజలు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొనే ప్రమాదం ఉందని గొల్లపూడి ఆంజనేయులు తెలిపారు. గత వారం రోజుల నుండి రెండు ట్రాక్టర్లతో ఇంజన్లు పెట్టి నీటిని బయటకు పంపుతున్నారని అన్నారు. చెరువులో నీరు లేకపోవడం వలన పశువులు, గొర్రెలు, మేకలకు కూడా నీటి ఎద్దడి ఏర్పడుతుందని అన్నారు. గ్రామానికి చెందిన పశువులు, గొర్రెలు, మేకలు, మొత్తం ఈ చెరువులోనే నీటిని తాగుతాయని అన్నారు. ప్రస్తుతానికి నీరు తోడకం తాత్కాలికంగా నిలిపివేసి, రెండు నెలల తర్వాత చేపడితే మంచిదని ఆంజనేయులు అన్నారు. ఈ విషయమై దేవాదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీనివాసరావును 'ప్రజాశక్తి' ప్రశ్నించగా చెరువులో నీరు బయటికి పంపుతున్న విషయం తనకు తెలిసి వెళ్లి చూశానని ,రెండు ట్రాక్టర్లతో ఇంజన్లు పెట్టి నీళ్ళు బయటకు పంపుతున్నారని అన్నారు . ఈ విషయమై గ్రామస్తులను పిలిపించి మాట్లాడానని, నీటిని బయటికి పంపడం ప్రస్తుతం ఆపివేసామని తెలిపారు.

సంక్షేమ పథకాలు అందుతున్నాయా..?

గ్రామస్తులను ఆప్యాయంగా పలకరించిన మంత్రి సురేష్

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

తాతా బాగున్నావా..అవ్వ సకాలంలో పింఛన్ అందుతుందా..అక్క, తమ్ముడు, అమ్మా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా అంటూ రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ గ్రామస్తులను ఆప్యాయంగా పలకరించారు. పెద్దదోర్నాల పట్టణంలోని ఒకటో సచివాలయం పరిధిలో గల ఎంపిడివో కార్యాలయ వీధిలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మంత్రి సురేష్ ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో కొన్ని ఏళ్ల నుంచి రోడ్లు, డ్రైనేజీలు, ఇళ్లు, పింఛన్లు మంజూరు చేయలేదని స్థానికులు మంత్రి సురేష్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో స్పందించిన మంత్రి సురేష్ అధికారులతో, సచివాలయ ఉద్యోగులతో మాట్లాడి అర్హత ఉంటే మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు.

మహిళతో మాట్లాడుతున్న మంత్రి సురేష్

పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలు..

వైసిపి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న 98 శాతం హామీలను నెరవేర్చిందన్నారు. పార్టీలకు, కుల మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. అర్హత ఉంటే ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

కార్యాలయాల చుట్టూ తిప్పించుకోవద్దు..

గ్రామాల్లో వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చే ప్రజలు, రైతులు, విద్యార్థులను కార్యాలయాల చుట్టు తిప్పుకోవద్దని సూచించారు. గ్రామాల్లో తాగునీటి నీటి ఎద్దడి లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ గంటా వెంకట రమణారెడ్డి, సర్పంచ్ చిత్తూరి హారిక, ఎంపిడివో విజయ, ఈవోఆర్డీ నాసర్‌రెడ్డి, ఎంఈవో మస్తాన్ నాయక్, హౌసింగ్ డీఈ సురేష్, నాయకులు గంటా గురువారెడ్డి, నెక్కటి వెంకటేశ్వరరెడ్డి, గుమ్మా యల్లేష్, చంద్రకాంత్‌రెడ్డితో పాటు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

లోకేష్‌కు టిడిపి జిల్లా నేతల సంఘీభావం

కడప జిల్లా బద్వేల్ నియోజకవర్గంలో అట్లూరు గ్రామ రాజుపాలెం వద్ద "యువగళం" పాదయాత్రలో నారా లోకేష్‌ను కలిసి సంఘీభావం తెలిపిన ఉమ్మడి ప్రకాశంజిల్లా తెదేపా ఎమ్మెల్యేలు గొట్టిపాటి రవికుమార్, డిబివి స్వామి, మాజీ ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధనరావు,ముత్తుముల అశోక్ రెడ్డి, బిఎన్ విజయ్ కుమార్,ఉగ్ర నరసింహారెడ్డి, నియోజకవర్గ ఇంచార్జ్‌లు ఎరిక్షన్ బాబు, ఎంఎం కొండయ్య, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి దామచర్ల సత్య తదితరులు..

వికలాంగుడికి బ్యాటరీ ట్రై సైకిల్ అందజేత

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పంచాయితీ పరిధిలోని వై కొత్తపల్లి గ్రామానికి చెందిన వనిపెంట పుల్లారెడ్డి అనే వికలాంగుడు నడవలేక ఇబ్బందులు పడుతున్నాడు. తనకు బ్యాటరీ ట్రై సైకిల్ మంజూరు చేసి.. ఆదుకోవాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌ను అభ్యర్థించారు. దీంతో స్పందించిన మంత్రి సురేష్ వెంటనే దివ్యాంగుడైన వనిపెంట పుల్లారెడ్డిని ఆదివారం యర్రగొండపాలెంలోని తన క్యాంపు కార్యాలయానికి పిలిపించి బ్యాటరీ ట్రై సైకిల్‌ను పంపిణీ చేశారు. ఈ సంధర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ దివ్యాంగులను ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. వాళ్ల పట్ల చిన్న చూపు చూడడం తగదన్నారు. దివ్యాంగులైన ఎందరో వివిధ రంగాల్లో ఉన్నత స్థానాలు అధిరోహించారని గుర్తు చేశారు.

బ్యాటరీ ట్రై సైకిల్ అందజేస్తున్న మంత్రి సురేష్

దివ్యాంగులను ప్రతి ఒక్కరూ మానవతా దృక్పదంతో ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్లు కొప్పర్తి ఓబుల్‌రెడ్డి, బోగోలు వెంకట సుబ్బారెడ్డి, గంజివారిపల్లి సర్పంచ్ దుగ్గెంపూడి సుబ్బారెడ్డి, నాయకులు గురిజేపల్లి వలితో పాటు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

చిన్నారులను ఆశీర్వదిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ

చిన్నారులకు బూచేపల్లి ఆశీర్వాదం

ప్రజాశక్తి-చీమకుర్తి

ఒంగోలు గెలాక్సీ అధినేత, చీమకుర్తి లయన్స్‌క్లబ్ అధ్యక్షులు చలువాది బదరినారాయణ మనుమడు, మనుమరాళ్ళను జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ఆశ్వీరదించారు. చలువాది బదరినారాయణ మనుమడు వకుళగోకుల్ కృష్ణసాయి నూతనవస్త్ర బహూకరణ, మనుమరాలు హేమశ్రీల పుష్పాలంకరణ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. కార్యక్రమాలలో పలువురు పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో జెవివి జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టర్ బి జవహర్, మాధవి దంపతులు, డాక్టర్ బి.లక్ష్మిశారద, డాక్టర్ బి రాహుల్, డాక్టర్ బి రమాలక్ష్మి దంపతులు, చలువాది పార్ధసారధి దంపతులు, చలువాది జగదీష్‌కుమార్ దంపతులు, మద్దిపాడు ఏఎంసి మాజీ ఛైర్మన్ మారం వెంకారెడ్డి, పలువురు పెరల్ గ్రానైట్ అధినేత చలువాది నాగరాజా దంపతులు, గ్రానైట్ యజమానులు, మేనేజర్లు, ఆర్యవైశ్య సంఘం నాయకులు, వాసవి మహిళా నాయకులు పాల్గొని ఆశీర్వదించారు.

విజ్ఞానాన్ని పెంపొందించే గ్రంథాలయాలు

ప్రజాశక్తి-సిఎస్‌పురం

గ్రంథాలయాలు విద్యార్థుల్లో విజ్ఞానాన్ని, నైపుణ్యాన్ని పెంపొందిస్తాయని గ్రంథపాలకులు ఆళ్ల భాస్కరరావు పేర్కొన్నారు. గత నెలరోజులుగా గ్రంథాలయం ఆధ్వర్యంలో విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. ఆదివారం ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ ఈ నెల రోజులు పాటు విద్యార్థులకు ప్రతి రోజూ స్పోకెన్ ఇంగ్లిష్, గ్రామర్ మరియు కథలు చెప్పడం, చదివించడం, క్విజ్, వ్యాసరచన, డ్రాయింగ్, డాన్స్ పాటలు-ఆటలు వంటి వాటిని నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విజేతలకు


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

బహుమతులు అందజేశారు. విద్యార్థులకు స్వీట్స్, డ్రింక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తోట శ్రీను, ఎన్.వెంకటరామయ్య, ప్రమీల శేఖర్‌రవి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

బహుమతులు అందజేస్తున్న దృశ్యం

ముగిసిన వేసవి శిక్షణా శిబిరాలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెంలోని శాఖా గ్రంథాలయంలో ఆదివారం వేసవి శిక్షణా శిబిరాలు ముగిశాయి. ఈ సంధర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామావత్ అరుణాబాయి, ప్రభుత్వ ఉపాధ్యాయులు మాలకొండా నాయక్, బివోసిల్ ఏజెంట్ బాలు నాయక్, గ్రంధపాలకురాలు కటికల ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-గిద్దలూరు

పట్టణంలోని విశ్వభారతి ఐటీ ఫౌండేషన్ పాఠశాలలో ఆదివారం బ్రహ్మానందరెడ్డి వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఇప్పటికే పది రూపాయల ఓపీతో పదిరూపాయలు డాక్టర్‌గా పేరొందిన బ్రహ్మానందరెడ్డి ఉచిత వైద్యశిబిరాలతో ప్రజలకు మరింత చేరువయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ బ్రహ్మానంద రెడ్డి మాట్లాడుతూ ఈ ఉచిత వైద్య శిబిరంలో 625 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. అలాగే జనరల్, ఈఎన్టీ, కంటి ఆపరేషన్లు సంబంధించి వైద్య పరీక్షలు కూడా నిర్వహించినట్లు తెలిపారు. పట్టణానికి చుట్టుపక్కల గ్రామాల వారు కూడా వైద్య శిబిరానికి వచ్చినట్లు

వైద్యసేవలందిస్తున్న డాక్టర్ బ్రహ్మానందరెడ్డి

చెప్పారు. వైద్య శిబిరానికి వచ్చిన ప్రతి ఒక్కరికీ కూడా భోజన సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఎన్.గాయత్రి, ఇతర ప్రముఖ వైద్యులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పుస్తకం హస్తభూషణం

జెవివి జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టర్ బి.జవహర్

ప్రజాశక్తి-చీమకుర్తి

పుస్తక పఠనం విద్యార్థులకు ఎంతగానో ఉపయోగకరమని, పుస్తకం హస్తభూషణమని జెవివి జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టర్ బి.జవహర్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి సెలవులలో శిక్షణ ముగింపు కార్యక్రమంలో విద్యార్థులకు బహుమతులు అందజేసి ఆయన మాట్లాడారు. పుస్తకాలు చదివే విషయంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. చీమకుర్తి లయన్స్‌క్లబ్ అధ్యక్షులు చలువాది బదరీ నారాయణ మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారా విద్యార్థులలో ఆత్మవిశ్వాసం, విజ్ఞానం పెరుగుతుందన్నారు. వేసవిలో విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను, గ్రంథపాలకుడు

బహుమతులు అందజేస్తున్న డాక్టర్ జవహర్, చలువాది బదరీనారాయణ

కె.సత్య నారాయణను సత్కరించారు. గ్రంథపాలకుడు కె.సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి ఏడాదీ వేసవిలో శిక్షణ కార్యక్రమంలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న చీమకుర్తి లయన్స్‌క్లబ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సంధర్భంగా శిక్షణ పొందిన 75 మంది విద్యార్థులకు లయన్స్ ద్వారా డాక్టర్ బి జవహర్, చలువాది బదరినారాయణ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చీమకుర్తి లయన్స్‌క్లబ్ కార్యదర్శి చలువాది రమేష్, గెలాక్సీ లయన్స్‌క్లబ్ కార్యదర్శి ఎం.రాజా, దిశా పౌండేషన్ వ్యవస్థాపకులు డి నాగరాజు, ఉపాధ్యాయులు పర్వతం వెంకటేశ్వర్లు, జి ప్రతాప్, యడ్లపల్లి నారాయణ, నరేంద్రకుమార్ పాల్గొన్నారు.

వెంకటయ్యను పరామర్శిస్తున్న టిడిపి ఎస్సీ నాయకులు

గోన వెంకటయ్యకు పరామర్శ

ప్రజాశక్తి-వెలిగండ్ల

మండల టిడిపి ఎస్సీసెల్ అధ్యక్షుడు గోన వెంకటయ్య ఇటీవల ప్రమాదవశాత్తు కిందపడి కాలికి గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న మండల టిడిపి ఎస్సీ నాయకులు ఆదివారం సాయంత్రం గోన వెంకటయ్య ఇంటికి వెళ్ళి పరామర్శించారు. ఆయన ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో తాతపూడి ఇమ్మానియేలు, గోన బన్నబాసు, గోన దేవా, తగరం సురేష్, మనోహర్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

విద్యార్థులతో ప్రదర్శన

ప్రజాశక్తి-తర్లుపాడు

పాఠశాలల ప్రారంభం సందర్భంగా మండలంలోని లింగారెడ్డికాలనీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్.మౌలాలి ఆధ్వర్యంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. పిల్లలందరూ 100శాతం హాజరు అయ్యేలా తల్లితండ్రులు పిల్లలను బడికి పంపించాలన్నారు. జగనన్న విద్యాకనుక అందజేస్తామని, పిల్లలను బడికి పంపించి ప్రభుత్వం కల్పించే అన్ని సౌకర్యాలూ పొంది పిల్లల విద్యాభివధ్ధికి దోహదపడేలా తల్లితండ్రులు బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సహ ఉపాధ్యాయులు వజ్రం శ్రీనివాసరెడ్డి, పిసి చైర్మన్ కొమ్మురవి, కలుజువ్వలపాడు ఉపసర్పంచ్ దేవదాసు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంకే బేగ్

గ్రంథాలయాలు విజ్ఞాన సూచికలు..

హేతువాద సంఘం నాయకులు ఎంకే బేగ్

ప్రజాశక్తి-టంగుటూరు

గ్రంథాలయాలు విజ్ఞాన సూచికలు అని హేతువాద సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మొఘల్ కాలేషా బేగ్ అన్నారు. ఆదివారం మండలంలోని జయవరం గ్రామంలో శ్రామిక స్వేచ్ఛ గ్రంథాలయం ప్రారంభ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా బేక్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో గ్రంథాలయాల ఏర్పాటు ప్రజలలో విజ్ఞాన శక్తికి దోహదం చేస్తుందని బేగ్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో విప్లవ రచయితల సంఘం రాష్ట్ర నాయకులు జి కళ్యాణరావు, హేతువాద సంఘం జిల్లా నాయకులు నూకతోటి పేరయ్య, విరసం జిల్లా అధ్యక్షులు చల్లాపల్లి నరసింగరావు, రచయిత ఉమ్మడిశెట్టి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

12 నుంచి ఉచిత ఓపీ సేవలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

సురక్ష హాస్పిటల్‌లో ఈనెల 12 నుంచి 17 వరకు ఉచిత ఓపి సేవలు అందుబాటులో ఉన్నాయని మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పివి మురళి తెలిపారు. సురక్ష హాస్పిటల్‌ను కర్నూల్ రోడ్ లోని నవభారత్ బిల్డింగ్స్ ఎదుటకు ఆదివారం మార్చామన్నారు. ఈ సందర్భంగా వారం రోజుల పాటు ఈ నెల 12 నుంచి 17 వరకు ఉచితంగా ఓపి చూస్తామన్నారు. ల్యాబ్ పరీక్షలలో 50 శాతం రాయితీ, ఆపరేషన్లు చేయించుకున్నవారికి అడ్మిషన్ ఇస్తామని, ఆపరేషన్లు అడ్మిషన్ అయినవారికి 30 శాతం రాయితీ ఇవ్వటం జరుగుతుందన్నారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

కాటూరివారిపాలెం వాసికి డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

పొదిలి మండలం కాటూరి వారిపాలెంకి చెందిన కంచర్ల విజయలక్ష్మికి డాక్టరేట్ లభించింది. ఆమె తెలంగాణ హైదరాబాద్ దివీస్ ల్యాబ్‌లో పనిచేస్తూ అనలైటికల్ కెమిస్ట్రీలో చేసిన పరిశోధనకు గీతం యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించారు. ఈనెల 10న విశాఖపట్టణం గీతం యూనివర్సిటీలో జరిగిన స్నాతకోత్సవంలో ఆమెకు డాక్టరేట్‌ను ప్రదానం చేసి సత్కరించారు. జిల్లా వాసికి డాక్టరేట్ రావటంతో పలువురు ప్రముఖులు ఆమెను అభినందించారు.

డాక్టరేట్ అందుకుంటున్న విజయలక్ష్మి

రాష్ట్రానికి ద్రోహం చేసి సంబరాలా..!

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు

ప్రజాశక్తి-కొండపి

తాము అధికారంలోకి వస్తే ఆంధ్రులకు 15 ఏళ్లపాటు ప్రత్యేక హోదా , ప్రాజెక్టుల నిర్మాణానికి, పారిశ్రామిక అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని చెప్పిన మాటలన్నీ నీటి మూటలను చేసి ద్రోహం చేసినవాళ్లు ఆంధ్రప్రదేశ్‌కు ఏం చేశామని సంబరాలు చేస్తారని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు విమర్శించారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చి 9 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సంబరాలు జరపాలని బిజెపి పిలుపునిచ్చిందని ఇదొక సిగ్గుమాలిన చర్యని ఆయన ఆయన విమర్శించారు. సంబరాలు జరిపేందుకు విశాఖ పట్నంలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పర్యటనను వ్యతిరేకిస్తూ సిపిఎం కార్యకర్తలు పెరిదేపిలో ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ ప్రత్యేక ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు చేస్తున్న సందర్భంలో రాష్ట్ర విభజన హామీలను మోడీ ప్రభుత్వం ప్రకటించినట్లు తెలిపారు. రాజధాని నిర్మాణానికి ఐదు లక్షల కోట్లు, పారిశ్రామికి అభివృద్ధికి దోహదపడతామని, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం చేస్తామని, మొదట ప్రత్యేక హోదా ఇస్తామని ప్రకటించినట్లు తెలిపారు. హామీలు ఇచ్చి 9 ఏళ్లు గడిచినా ఏఒక్కటీ అమలు కాలేదని తెలిపారు. వెనకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తామని, అత్యంత వేగంగా కేంద్ర ప్రభుత్వ సంస్థల నిర్మాణం చేస్తామని చెప్పిన మాటలను బిజెపి ప్రభుత్వం విస్మరించిందన్నారు. అభివృద్ధి, నిధులు కేటాయింపు గురించి ఇచ్చిన హామీలు అమలు చేయక పోగా , ప్రాణ త్యాగాలు చేసి సాధించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని తమ తాబేదారులకు అప్పణంగా కట్టబెట్టేందుకు సిద్ధమైందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రా హక్కులను హరిస్తూ, ఫెడరల్ రాజ్యాంగ స్వభానికి విరుద్ధంగా మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. లౌకిక విలువలను గంగలో కలిపే చర్యలకు పాల్పడుతుందని విమర్శించారు. అయినప్పటికీ రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసిపి, ప్రతిపక్ష పార్టీలు పట్టించకోక పోవడం దారుణమన్నారు. ప్రజలను మోసం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర రాజకీయాలను ప్రజలు గమనించాలన్నారు. ప్రజల అన్యాయంపై వావ పక్షాల చేస్తున్న ఉద్యమాల్లో భాగస్వాములు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కెజి. మస్తాన్, మండల కమిటీ సభ్యులు మల్లెల కొండయ్య, కాలే మల్లికార్జునరావు, ముప్పరాజు చినబ్రహ్మయ్య, అంగలకుర్తి బ్రహ్మయ్య, పుట్టా రామారావు, గడ్డం వందనం, కామని బ్రహ్మయ్య, ఎస్. రమణయ్య, ఎల్.దావీదు, పి.జక్కరయ్య, కాలే చిన్న బ్రహ్మయ్య, ఎల్.ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కంకణాల ఆంజనేయులు

ముగిసిన వేసవి శిబిరాలు

ప్రజాశక్తి-కొల్లూరు

కొల్లూరు శాఖ గ్రంధాలయంలో గత 35 రోజులుగా నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా విద్యార్థులకు కథలు చెప్పడం, వకత్వ, చిత్రలేఖనం, క్విజ్, లెమన్ అండ్ స్పూన్ పోటీలు నిర్వహించారు. అదేవిధంగా సాంస్కృతి కార్యక్రమాలపై పోటీలను నిర్వహించారు. విజేతలకు వైస్ ఎంపిపి మురాల రాంబాబు చేతుల మీదగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, గ్రంథపాలకుడు పాల్గొన్నాడు. **సంతమాగులూరు :** వేసవి విజ్ఞాన శిబిరాలు విద్యార్థులకు పరిజ్ఞానాన్ని సమకూర్చి పెట్టినట్లు ఎంపిపి ఎనుబర్ల యలమంద తెలిపారు. వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు సందర్భంగా ఆదివారం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకుడు బాదం విజయ భాస్కర్ రెడ్డి, గ్రామ సర్పంచి జమ్ముల నాగరాజు, ఎంపిపి అంకారావు, ఉపాధ్యాయులు పాపయ్య, బండి ఓబుల్ రెడ్డి పాల్గొన్నారు. **ఇంకొల్లు రూరల్ :** వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా మండ పరిధిలోని ఇడుపులపాడు శాఖ గ్రంథాలయంలో చిన్నారులకు చిత్రలేఖనం. కథల పుస్తకాలు, బొమ్మల పుస్తకాలు, నీతి కథల పుస్తకాలు చదవడం, డ్యాన్సు పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాల కురాలు ఎ.శకుంతల, విద్యార్థులు పాల్గొన్నారు. **కొండపి :** గ్రంథాలయంలోని పుస్తకాలను ప్రతి ఒక్కరూ సద్వి నియోగం చేసుకోని విజ్ఞాన వంతులు కావాలని మండల కో ఆప్షన్ మెంబర్ షేక్ బాబూరావు తెలిపారు.

సంతమాగులూరులో బహుమతులు అందజేస్తున్న దృశ్యం

కొల్లూరులో బహుమతులు అందజేస్తున్న దృశ్యం

వేసవి విజ్ఞాన శిబిరం సభను నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయడు ఎం. శ్రీధర్, రత్నాచారి, పెరిదేపి మాజీ సర్పంచి గుమ్మళ్ల వెంకటేశ్వర్లు, మాజీ వైస్ ఎంపిపి ఆర్.నాగేశ్వరరావు హాజరయ్యారు. **చీమకుర్తి :** పుస్తక పఠనం విద్యార్థులకు ఎంతగానో ఉపయోగకరమని, పుస్తకం హస్తభూషణమని జెవివి జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ బి. జవహర్ తెలిపారు. స్థానిక శాఖా గ్రంధాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ ముగింపు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా చీమకుర్తి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చలువాది బదరీ నారాయణ మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారా విద్యార్థులలో ఆత్మవిశ్వాసం, విజ్ఞానం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకుడు సత్యనారాయణ, చీమకుర్తి లయన్స్‌క్లబ్ కార్యదర్శి చలువాది రమేష్, గెలాక్సీ లయన్స్‌క్లబ్ కార్యదర్శి ఎం.రాజా, దిశా ఫౌండేషన్ వ్యవస్థాపకులు డి.నాగరాజు, ఉపాధ్యాయులు పర్వతం వెంకటేశ్వర్లు,జి. ప్రతాప్, యడ్లపల్లి నారాయణ, నరేంద్రకుమార్ పాల్గొన్నారు. **భట్టిప్రోలు :** భట్టిప్రోలు మాటూరు రామారావు శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా తరగతులు ముగిశాయి. ఈ సందర్భంగా వివిధ పోటీలకు గెలుపొందిన విజేతలకు గ్రామ సర్పంచి దారా రవి కిర్మణయి అందజేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు బొలిశెట్టి శ్రీనివాసరావు, నాయకులు చెన్నయ్య, గ్రంథపాలకుడు కె. సుభాష్ చంద్రబోస్ పాల్గొన్నారు. **అద్దంకి :** స్థానిక శాఖా గ్రంధాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరం పోటీలు ఆదివారంతో ముగిశాయి. వేసవి విజ్ఞాన శిబిరంలో సుమారుగా 40 మంది విద్యార్థులు పాల్గొన్నారు.వారికి క్విజ్, వ్యాసరచన, స్టోరీ టెల్లింగ్, క్రాఫ్ట్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సజన సంస్థ అధ్యక్షుడు దివాకర్ దత్తు, అద్దంకి నాగేశ్వరరావు, కాజా నాగేశ్వరరావు, పొట్టి సత్యనారాయణ, గ్రంథ పాలకుడు పాలకుడు తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తిలో బహుమతులు అందజేస్తున్న డాక్టర్ జవహర్

బట్టిప్రోలులో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

అద్దంకిలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

విద్యుత్ కోతలతో ఇక్కట్లు

ప్రజాశక్తి-పర్చూరు

అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు అల్లాడుతున్నారు. రాత్రి సమయంలోనూ విద్యుత్ కోత విధిస్తున్నారు. దీంతో దోమల బెడద, ఉక్కపోతతో ప్రజలు అల్లాడుతున్నారు. వృద్ధులు, చిన్నారుల పరిస్థితి దారుణంగా ఉంటుంది. పర్చూరులో 5 వేలకు పైగా విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ముఖ్య ప్రాంతాల్లో 50 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. కొన్నేళ్ళుగా విద్యుత్ వినియోగం పెరిగింది.అందుకు అణుగుణంగా అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు ఏర్పాటు చేయాల్సిఉంది. స్థలం లేదని, సామగ్రి కొరతతో కొన్ని చోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయలేదు. వేసవి నేపథ్యంలో వినియోగం పెరగడంతో విద్యుత్ తీగలు తెగిపోతున్నారు. ఫీజు క్యారియర్లు కాలిపోతున్నాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుంది. విద్యుత్ సరఫరా నిలిచిపోయిన సమయంలో ప్రజలు ఉక్కపోతకు గురికావాల్సి వస్తుంది. ఉక్కపోత, వేసవి తీవ్రత తాళలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చీతల పాణియాలను తాగుతున్నారు. ఇళ్లలో ఉండలేక చెట్ల కిందకు పరుగులు తీస్తున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధుల పరిస్థితి దారుణంగా ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అవసరమైన చోట నూతన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

మాజీ ఎమ్మెల్యే కందులను పరామర్శిస్తున్న టిడిపి నాయకులు

'కందుల'కు పరామర్శ

ప్రజాశక్తి-పొదిలి

ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాదులో విశ్రాంతి తీసుకుంటున్న టిడిపి మార్కాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిని పొదిలికి చెందిన టిడిపి నాయకులు ఆదివారం పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు. కందుల ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. కందులను పరామర్శించిన వారిలో టిఎన్ఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ గౌస్ బాషా, మాజీ ఎంపిటిసి డాక్టర్ సయ్యద్ ఇమాంసాహెబ్, నాయకులు జ్యోతి మల్లికార్జునరావు, దివ్వెల మురళి, వెంకటేశ్వర్లు, గాలిముట్టి నరసింహారావు, వెంకట నారాయణ ఉన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-మార్కాపురం

డివిజన్ కేంద్రమైన మార్కాపురంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు విజయ్ డిమాండ్ చేశారు. స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ మార్కాపురం ఏరియా కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ మార్కాపురంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడం విడ్డూరమన్నారు. మార్కాపరం ప్రాంతంలో సుమారు 10 జూనియర్ కళాశాలలు ఉన్నాయన్నారు. ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులకు ఉచిత ఉన్నత విద్యను అందించే ప్రభుత్వ డిగ్రీ కళాశాల అందుబాటులో లేదన్నారు. దీంతో పై చదువులకు డబ్బు ఖర్చు చేయాల్సి వస్తోందన్నారు. అందరికీ ఆర్థిక స్థోమత లేని కారణంగా పేద విద్యార్థులు ఇంటర్మీడియట్‌తోనే చదువుకు స్వస్తి పలకాల్సి వస్తోందన్నారు. మార్కాపురం ప్రాంత పేద విద్యార్థులను దష్టిలో ఉంచుకుని, వారి ఉన్నత విద్యాభ్యాసానికి బాటలు వేసేలా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకొనేలా అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు లోకేష్, లీలాధర్, బ్రహ్మాచారి, షఫీ పాల్గొన్నారు.

జగన్ వీరాభిమానికి మంత్రి అభినందన

జగన్ వీరాభిమాని రాజును అభినందిస్తున్న మంత్రి సురేష్

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని తిరిగి 2024లో ముఖ్యమంత్రిగా చూడాలనే కుతుహలంతో నెల్లూరుకు జిల్లాకు చెందిన రాజు అనే జగన్ వీరాభిమాని మోటారు సైకిల్‌పై రాష్ట్రంలోని 175 నియోజకవర్గాలు తిరుగుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్నారు. ఇప్పటిదాకా 65 నియోజకవర్గాలు తిరిగారు. ఈ క్రమంలోనే ఆదివారం 66వ నియోజకవర్గంగా యర్రగొండపాలెంకు వచ్చారు. యర్రగొండపాలెంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. తిరిగి 2024లో జరిగిగే ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. అనంతరం మంత్రి సురేష్ క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. తాను చేపట్టిన యాత్ర గురించి, ఇప్పటి వరకు తిరిగిన నియోజకవర్గాల గురించి, ప్రజల స్పందన గురించి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ రాజును అభినందించారు. మీ లాంటి వీరాభిమానులు జగనన్నకు ఎంతో అవసరం అన్నారు. మండు వేసవిలోనూ అంఖుటిత దీక్షతో గ్రామాలు తిరగడం చాలా గొప్ప విషయం అన్నారు. మీ సేవలను జగనన్న తప్పకు గుర్తుంచుకుంటారని చెప్పారు. మరింత రెట్టింపు ఉత్సాహంతో ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ కొప్పర్తి ఓబుల్‌రెడ్డి, గంజివారిపల్లి సర్పంచ్ దుగ్గెంపూడి సుబ్బారెడ్డి, నాయకులు నర్రెడ్డి వెంకటరెడ్డి, గురిజేపల్లి వలి తదితరులు పాల్గొన్నారు.

ఎండల తాకిడికి

పిట్టల్లా రాలిపోతున్న యాచకులు

వడదెబ్బతో ఇద్దరు మృతి

ప్రజాశక్తి-శింగరాయకొండ

ఎండల తాకిడికి సామాన్య ప్రజలు విలవిల్లాడిపోతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం దాకా ఇళ్లలో నుంచి బయటికి రావాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇక యాచకులు బాధలు వర్ణణాతీతం. తినీతినక, నీరు తాగీతాగక మత్యువాత పడుతున్నారు. శింగరాయకొండలో ఆదివారం ఇద్దరు యాచకులు చనిపోయినట్లు పోలీసులు గుర్తించారు. శింగరాయకొండ ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో ఒక యాచకుడు శనివారం రాత్రంతా ఆ మధ్యలో తిరుగుతూ ఆదివారం మధ్యాహ్నం సమయంలో మతి చెందాడు. మూలగుంటపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని దేవిసీఫుడ్స్ ఎదురుగా ఉన్న ఓ ఖాళీ స్థలంలో మరో యాచకుడు మతి చెందినట్లు గుర్తించారు. హెడ్‌కానిస్టేబుల్ భాస్కర్ లింగం ఆధ్వర్యంలో ఈ ఇద్దరు యాచకుల మృతదేహాలను పరిశీలించి, ఎండల తాకిడికి తట్టుకోలేక మతి చెందినట్లు తేల్చారు. వీరిద్దరూ భిక్షాటన చేసుకొని జీవనం సాగించే వాళ్ళని నిర్ధారించి యువ నేస్తం ఫౌండేషన్ చైర్మన్ అంకేపల్లి బంగారు బాబుకు సమాచారం ఇవ్వడంతో హెడ్‌కానిస్టేబుల్ భాస్కర్ లింగం ఆధ్వర్యంలో వాళ్లకి అంత్యక్రియలు నిర్వహించారు.

కొండెక్కిన 'కోడి' ధర

కిలో చికెన్ రూ.300

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

సామాన్యులకు అందుబాటులో లేని విధంగా కోడి మాంసం ధరలు అమాంతంగా పెరిగాయి. చాలా కాలం తరువాత ఊహించని విధంగా కోడి ధర కొండెక్కింది. ప్రస్తుతం బ్రాయిలర్ కోడి మాంసం కిలో రూ.300 దాటింది. లైవ్ ధర రూ.175కు చేరింది. చాలా కాలం తరువాత ఇంత భారీ స్థాయిలో ధరలు పెరగడం ఇదే మొదటిసారి. దీంతో సామాన్యులు కోడి మాంసం తినే పరిస్థితి కరవు అయ్యింది. సుమారు ఐదు నెలల కిందట కోడి ధరలు అమాంతం పడిపోయాయి. 100 రూపాయల లోపే కిలో లైవ్ ధర వుండేది. దీంతో పౌల్ట్రీ రైతులు తీవ్రంగా నష్టపోయి లబోదిబోమన్నారు. స్వంతంగా కోళ్లను పెంచి విక్రయించే రైతులు లక్షల్లో నష్ట పోయారు. కంపెనీల ద్వారా పౌల్ట్రీలు నడిపే రైతులు సైతం రేట్ ఇన్సెంటివ్ లేక నష్టపోవలసి వచ్చింది. అప్పట్లో పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో పడింది. కార్తీక మాసంలో అనేక మంది నాన్ వెజ్ తినరు. ఆ సమయంలో కోడి మాంసం ధరలు కొంచం తక్కువగా వుండడం సహజం. కార్తీక మాసంలో వున్న ధరలు కంటే, ఆ తరువాత ధరలు ఇంకా తగ్గడం వెనుక పౌల్ట్రీ కార్పొరేట్ శక్తులు మాయాజాలమే అని పౌల్ట్రీ వ్యాపారస్తులు అవేదన చెందుతున్నారు.

ప్రస్తుత ధరలు బట్టి రైతులకు మంచి లాభాలు రావడం సహజమే. అయినా, ఇంత భారీ స్థాయిలో కోడి ధర పెరగడం అనూహ్యమే. పెరిగిన భారీ ధరలతో సామాన్యులకు ఆర్థిక భారం తప్పదు. ఆదివారం వస్తే చికెన్ తినాలనే కోరిక కూడా పేదలు చంపుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లాలో సుమారు 20 లక్షల కిలోల కోళ్ల టన్ ఓవర్ ఉండగా ఆదివారం 30 లక్షలు దాటుతుంది. సాధారణ రోజుల్లో 20 లక్షల కిలోల కోళ్ళు అంటే కిలో రూ. 300 వేసుకున్నా రోజుకు రూ. ఆరు కోట్ల టన్ ఓవర్ సాగుతుంది. వేసవి తాపంతోనే ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. ఏది ఏమైనా వివాహాలు, ఇతర కార్యక్రమాల్లో నాన్ వెజ్ ఏర్పాటు చేసే వారికి మాత్రం అదనపు భారం తప్పడం లేదు.

ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

పిడిసిసి బ్యాంక్ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య

ప్రజాశక్తి-టంగుటూరు

టంగుటూరు పరిసర ప్రాంత పేద ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం స్ఫూర్తి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పిడిసిసి బ్యాంక్ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య అన్నారు. ఆదివారం స్థానిక టంగుటూరు పంచాయతీ పరిధిలోని బుచ్చిరాజుపాలెం న్యూ జెరూసలేం చర్చి సమీపంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ప్రముఖ రెటీనా, కంటి వైద్యనిపుణులు డాక్టర్ మానస పెనుమెచ్చ ప్రారంభించారు. డాక్టర్ మాదాసి వెంకయ్యతో పాటు పలువురు వైద్యులు రోగులకు వైద్యసేవలందించారు. వైద్య శిబిరంలో ప్రజలకు ఈసీజీ, బీపీ, షుగర్ పరీక్షలు ఉచితంగా చేసి. మందులను పంపిణీ చేశారు. అదేవిధంగా గత శనివారం రాత్రి పోతుల చెంచయ్య వెస్ట్ కాలనీలో ఏర్పాటు

వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ మానస

చేసిన వైద్య శిబిరంలో దాదాపు 80 మంది రోగులకు ఉచితంగా పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. టంగుటూరు ప్రాంత పేద ప్రజల ఆరోగ్యం కోసం స్ఫూర్తి సేవా సంస్థ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని డాక్టర్ మాదాసి వెంకయ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో స్ఫూర్తి స్వచ్ఛంద సేవా సంస్థ గౌరవ సలహాదారు, ఆదాయపన్ను శాఖ సహాయ కమిషనర్ బొడ్డు వెంకటేశ్వరరావు, ఒంగోలుకు చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ అనపర్తి శ్రీనివాసరావు, ప్రముఖ చర్మవ్యాధుల వైద్యనిపుణులు డాక్టర్ బి.చెంచయ్య, డాక్టర్ జె.నాగేశ్వరరావు, స్ఫూర్తి సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

చూడచక్కని గ్రామాలే లక్ష్యం

- పంచాయతీల అభివృద్ధికి చర్యలు
- చెత్త నుంచి సంపద కేంద్రాలు ఏర్పాటు
- 'కాఫీ విత్ క్లాప్ మిత్ర'కి విశేష స్పందన
- జిల్లా పంచాయతీ అధికారి నారాయణరెడ్డి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలోని పంచాయతీల పరిధిలోని గ్రామాలలో మౌలిక వసతులు కల్పించి చూడ చక్కని గ్రామాలుగా చేయటమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి జివి.నారాయణరెడ్డి తెలిపారు. జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమం ద్వారా మెరుగైన పారిశుధ్య నిర్వహణను చేపడుతున్నామన్నారు. చెత్త నుంచి సంపద కేంద్రాలు ఏర్పాటు చేయటం ద్వారా చెత్తను వేరు చేసి ఆయా పంచాయతీలకు ఆదాయం చేకూరేలా చర్యలు చేపట్టామన్నారు. ఇటీవల చేపట్టిన కాఫీ విత్ క్లాప్ మిత్రలు కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తుందన్నారు. జిల్లా పంచాయతీ శాఖ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను డిపిఒ జివి నారాయణ రెడ్డి ప్రజాశక్తికి వివరించారు.

కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లాలో పంచాయతీలను అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. రాష్ట్ర ప్రభుత్వం, కలెక్టర్ ఆదేశాల మేరకు పంచాయతీలలోని గ్రామాలను చూడచక్కని గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టాం. జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమం ద్వారా చెత్త నిర్వహణ కార్యక్రమాలను సమర్ధవంతంగా అమలు చేస్తున్నాం. క్లాప్ మిత్రలు ద్వారా గ్రామాలోని చెత్తను సేకరించి చెత్త నుంచి సంపద కేంద్రాలకు తరలిస్తున్నాం. దోమల నివారణకు ఏఎన్ఎం, ఆశా కార్యకర్తల ద్వారా ప్రజలకు గ్రామాలలో అవగాహన కల్పిస్తున్నాం.

సంపద కేంద్రాలు ఏర్పాటు

గ్రామ పంచాయతీలలో చెత్త నుంచి సంపద కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం. ఘన వ్యర్ధాల నిర్వహణలో భాగంగా ప్లాస్టిక్ వ్యర్ధాలను సమీపంలోని ప్లాస్టిక్ ష్రెడ్డర్ ఉన్న చెత్త సంపద కేంద్రాలకు తరలించి అక్కడ ప్రాసెస్ చేసి అమ్మేలా చర్యలు చేపట్టాం. తడి, పొడి, హానికారక చెత్తలు వేరు చేసి తడి చెత్తతో వర్మీ

కంపోస్టు తయారు చేస్తున్నాం. పొడి చెత్తను శుద్ధి చేసి విక్రయించేలా చర్యలు చేపట్టాం. చెత్త నుంచి సంపద కేంద్రం వద్ద అల్లుకునే తీగజాతి మొక్కలు నాటాలని సూచించాం. తద్వారా సంపద కేంద్రంపై తీగ అల్లుకొని చల్లదనం ఏర్పడుతోంది. దీంతో వాన పాములు ఎక్కువ కాలం బతికి ఉంటాయి.

కాఫీ విత్ క్లాప్ మిత్రకు విశేష స్పందన

గ్రామ పంచాయతీలో కాఫీ విత్ క్లాప్ మిత్ర కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. క్లాప్ మిత్రలతో కొంత సమయం అడిగి వారి పనుల వివరాలు తెలుసుకోవటం కార్యక్రమ లక్ష్యం. ప్రతి రోజు క్లాప్ మిత్రలు సేకరించిన చెత్తను. గ్రామంలో రోడ్లు, వీధుల వెంట ఉన్న చెత్త కుప్పలు ఎప్పటికప్పుడు తొలగించి చెత్త నుంచి సంపద కేంద్రాలకు తరలిస్తున్నాం

గ్రామాలలో ఫ్రై డే - డ్రైడే నిర్వహణ

గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాలలో ప్రతి శుక్రవారం ఫ్రైడే - డ్రై డే నిర్వహిస్తున్నాం. నీటి నిల్వలు ఉన్న చోట ఆయిల్ బాల్స్ వేయిస్తున్నాం. దోమల వ్యాప్తిని నివారించటానికి ఎఎన్ఎం, ఆశా కార్యకర్తల సమన్వయం చర్యలు చేపడుతున్నాం. స్వయం సహాయక సంఘాల సభ్యులకు డ్రై డే నిర్వహణపై శిక్షణ ఇస్తున్నాం. స్వశక్తి సంఘాల మహిళలు వారి ఇళ్ళ పరిసరాలలో ఫ్రైడే - డ్రై డే కార్యక్రమాలు చేయాలని, ఇది అందరి బాధ్యతని అవగాహన కల్పిస్తున్నాం.

త్వరలో గ్రీన్ అంబాసిడర్ల జీతాలు చెల్లింపు

జిల్లాలో పంచాయతీలో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్ల జీతాలు చెల్లించేందుకు చర్యలు చేపట్టాం. వీరికి రావాల్సిన జీతాలకు సంబంధించి ప్రభుత్వానికి నివేదికలు అందించాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే చెల్లించేందుకు చర్యలు చేపడతాం. రానున్న కాలంలో అందరి సహకారంతో గ్రామ పంచాయతీలను అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడతాం.